# నేటి నిజం

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 6-1-2023 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 112 పేజీలు:6 వెల: రూ.1/-


## 81వేల ప్రభుత్వ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు : మంత్రి హరీశ్‌రావు

కోరుట్ల, జనవరి 5:రాష్ట్ర ప్రభుత్వం 81వేల ప్రభుత్వ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు జారీ చేస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు.

2023 సంవత్సరాన్ని ఉద్యోగ తెలంగాణగా ప్రభుత్వం మార్చిందని అన్నారు. గురువారం రూ. 20 కోట్లతో అప్‌గ్రేడ్ చేసిన వంద పడకల ఆస్పత్రికి మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి నేటి వరకూ ఒక్క వైద్య ఆరోగ్య శాఖ లో 6,431 డాక్టర్ పోస్టులు, 7600 స్టాఫ్ నర్స్ లు, 5192 పారా మెడికల్ సిబ్బంది.

1900 మంది ఇతర సిబ్బంది మొత్తం 21,200 మందిని కొత్తగా నియమించామని అన్నారు.

దేశంలో కేంద్ర ప్రభుత్వ హయాంలో 6 శాతం ఉన్న నిరుద్యోగం 8.3 శాతానికి పెరిగిందని వివరించారు. తెలంగాణ లో 4.1 మాత్రమే నిరుద్యోగిత రేటు ఉందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణ లో మూడే డయాలసిస్ సెంటర్లు ఉండగా ఇపుడు 122 చేశామని అన్నారు.

ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి నియోజకవర్గం కు ఒక డయాలసిస్ సెంటర్ తీసుకొచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ లో 200 ఉన్న ఐసీయూ బెడ్ లను 6వేలకు పెంచామని గుర్తు చేశారు.

## కామారెడ్డి మాస్టర్ ప్లాన్ నిరసనలపై మంత్రి కేటీఆర్ స్పందన

హైదరాబాద్, జనవరి 5: కామారెడ్డి మాస్టర్ ప్లాన్ నిరసనలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పట్టణ ప్రగతి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను ఆ జిల్లా అదనపు కలెక్టర్‌ను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.

కేవలం మాస్టర్ ప్లాన్ ముసాయిదా మాత్రమే ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. ప్రజల కోణంలోనే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యంతరాలు ఉంటే ముసాయిదాలో మార్పులు చేస్తామని ప్రకటించారు. వినతులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రజలకు అన్ని విషయాలు వివరించాలని సూచించారు. 500 ఎకరాలు ఇండస్ట్రియల్ జోన్‌కు పోతోందని ఆందోళన చెందుతున్నారు. భూమి పోతుందని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో చూశానని తెలిపారు. ఈ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టేందుకు లేదని స్పష్టం చేశారు. నిర్మాణాత్మక నగరాలు, పట్టణాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్ చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి.. వ్యతిరేకంగా ఉండొద్దు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి పెద్దపీట

### -క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్‌గా ఆంజనేయ గౌడ్ బాధ్యతలు స్వీకరణ



హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమం లో క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ గా డాక్టర్ ఇ. ఆంజనేయ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్లు రాష్ట్రం లో అందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు నగదు పురస్కారాలను ఘననీయంగా పెంచడం జరిగిందన్నారు. నిజామాబాద్ బిడ్డ నిక్కత్ జరీన్ , షూటింగ్ క్రీడాకారిణి ఇషా సింగ్ లకు ఒక్కొక్కరికి 2 కోట్ల రూపాయల నగదు పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు. బంజారాహిల్స్ హిల్స్ లో ఇంటి జాగాలను కేటాయించామన్నారు.ప్రభుత్వానికి చైర్మన్ లు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడా పాలసీ ని త్వరలో ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఖ రాములు, ఓఒఅ లు కల్వకుంట్ల కవిత, బండ ప్రకాష్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఓఒం లు క్రాంతి కిరణ్, మనోహర్ రెడ్డి, మాజీ ఓఒం బానోతు చంద్రావతి, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, ఃఅ కమిషన్ సభ్యులు కిషోర్, ప్రభుత్వ కార్పోరేషన్ చైర్మన్ లు డా. ఆయాచితం శ్రీధర్, జులూరి గౌరీ శంకర్, సాయి చంద్, రాజీవ్ సాగర్, వాసుదేవ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, బాలరాజు యాదవ్, బండారి భాస్కర్, తదితర ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 2 కోట్ల 99 లక్షల 92 వేల 941 మంది ఓటర్లు

హైదరాబాద్, జనవరి 5:రాష్ట్రానికి సంబంధించిన ఓటర్ల తుది జాబితాను వెల్లడైంది. తెలంగాణలో 2 కోట్ల 99 లక్షల 92 వేల 941 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కోటి 50 లక్షల 48 వేల 250 మంది పురుష ఓటర్లు ఉండగా, కోటి 49 లక్షల 24 వేల 718 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

హైదరాబాద్ జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 42,15,445, రంగారెడ్డి జిల్లాలో 31,08,068, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 25,24,951 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6,44,072 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడైంది. ఇక భద్రాచలం 1,42,813 మంది ఓటర్లతో అత్యల్ప ఓటర్లుగా ఉన్న నియోజకవర్గంగా భద్రాచలం నిలిచింది. ప్రతి ఏడాది ఓటర్ల జాబితా సవరణ తర్వాత జనవరి నెలలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రకటిస్తుంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ గురువారం ఓటర్ల జాబితాను విడుదల చేశారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ తొలుకువ లోడుట సినిమా
లోకమున నెన్నదగిన రోజిర్మలుగా
సోకులతీలా వలెగా
రాకా శశియై జయంతి ప్రగతులను గానున్!!

( జనవరి 6 జయంతి జననం..) -రాధశ్రీ

సెల్:9494481210



## ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సర్ ఛోటూ రామ్ అవార్డ్



హైదరాబాద్, జనవరి 5:భారత రైతాంగ శ్రేయస్సు కోసం మహాయజ్ఞం మొదలుపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు సర్ ఛోటూ రామ్ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు కలిసి అవార్డును అందజేశారు.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద రంగం వ్యవసాయం. ఇందులో విశేషమైన మార్పు రావాలన్నది కేసీఆర్ సంకల్పం అని స్పష్టం చేశారు. ఇక్కడి భూమిని, నీళ్లను, మానవ వనరులను సద్వినియోగం చేసుకుని ప్రపంచానికి మనమే అన్నం పెట్టే స్థాయికి భారత్ ఎదగగలదు. కానీ ప్రస్తుత విధానాలు అందుకు తగ్గట్టులేవు అని తెలిపారు.

ఆహార రంగంలో గొప్ప ఉపాధి అవకాశాలు ఉన్నాయని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చేసిన ప్రయత్నాలు ఏవీ కనిపించలేదన్నారు. తెలంగాణ మోడల్ దేశానికి పరిచయం చేసి కొత్త దారి చూపాలన్న తపనతో సీఎం ఉన్నారని స్పష్టం చేశారు. దీనికి మేధావులు, రైతు నాయకులు విశేషంగా ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి 700 మంది పైచిలుకు రైతులు చనిపోతే కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోయిందన్నారు. రైతుల పోరాటానికి తలొగ్గి, నిస్సిగ్గుగా జాతికి క్షమాపణలు చెప్పి చట్టాలను వెనక్కి తీసుకున్నా చనిపోయిన రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలన్న ఆలోచన తట్టలేదని ధ్వజమెత్తారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాల ఎల్లలు దాటి చనిపోయిన రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున సాయం అందించారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు.

ఇది ఆర్థిక చేయూత మాత్రమే కాదు .. రైతుల కష్టాలలో భాగం పంచుకునే ఒక గొప్ప ముఖ్యమంత్రిని కేసీఆర్‌లో చూస్తున్నాం అని పంజాబ్ రైతు నాయకులు కొనియాడారు.

హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంజాబ్ రైతులు ప్రదానం చేసిన సర్ ఛోటూ రామ్ అవార్డును రైతాంగ ప్రతినిధుల నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మూసీ రివర్ బోర్డ్ మేనేజ్‌మెంట్ చైర్మన్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అవార్డును మంత్రికి అందజేసిన వారిలో ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సంయుక్త కిసాన్ మోర్చా సభ్యులు సత్నాం సింగ్ బెహ్రూ, ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ అఖిల భారత సలహాదారులు సుఖ్ జిందర్ సింగ్ కాకా, రాచ్ పాల్ సింగ్ ఖల్సా, మీడియా కార్యదర్శి అవతార్ సింగ్ దుండా ఉన్నారు.

### అసలు ఎవరీ సర్ ఛోటు రామ్?

పంజాబ్ రైతులు ప్రధానంగా ఇద్దరు వ్యక్తులను ఆరాధిస్తారు. ఒకరు సర్ ఛోటూ రామ్, మరొకరు స్వామినాథన్. 1881లో బ్రిటీష్ ఇండియాలో పంజాబ్ ప్రావిన్స్‌లో సర్ ఛోటూ రామ్ ఝూట్ కుటుంబంలో జన్మించారు. యునైటెడ్ పంజాబ్ ప్రావిన్స్‌ను పాలించిన నేషనల్ యూనియనిస్ట్ పార్టీకి ఆయన సహ వ్యవస్థాపకుడు. నాడు కాంగ్రెస్, ముస్లింలీగ్‌ను తన పార్టీకి దూరంగా ఉంచారు. వడ్డీ వ్యాపారుల చేతుల్లో పడి నలిగిపోతున్న నాటి పంజాబ్ రైతుల శ్రేయస్సు దృష్ట్యా సర్ ఛోటూ రామ్ 1934లో పంజాబ్ రిలీఫ్ అప్పుల చట్టం, 1936లో పంజాబ్ రుణదాతల రక్షణచట్టం తేవడానికి కృషిచేశారు. తదనంతర కాలంలో ఈ చట్టాలు పంజాబ్ రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పులు తెచ్చాయి. ఆ తర్వాత హరితవిప్లవంతో స్వామినాథన్ పంజాబ్ రైతులను గణనీయంగా ప్రభావితం చేశారు. ఆ తర్వాత తమను ప్రభావితం చేసిన వ్యక్తి కేసీఆర్ అని పంజాబ్ రైతులు మంత్రి నిరంజన్ రెడ్డితో అన్నారు. అందుకే ఈ అవార్డు వారికి ఇస్తున్నట్లు పంజాబ్ రైతులు వెల్లడించారు.

## చిరుదాన్యాలు (మిల్లెట్స్) తో ఆరోగ్య పరిరక్షణ

### -ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ పోస్టర్‌ను రాష్ట్ర గవర్నర్ తమిళ సై



హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇండియన్ మినిట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ పోస్టర్ ను రాష్ట్ర గవర్నర్ తమిళ సై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ చిరుదాన్యాలు (మిల్లెట్స్) మన ఆరోగ్య పరిరక్షణను ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. మన పూర్వికులు చిరుదాన్యాలు వాడి ఏలాంటి రోగాల బారిన పడకుండా వంద సంవత్సరాలు జీవించగలిగిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసారు. అనంతరం అసోసియేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పురం వెంకటేశం గుప్త మాట్లాడుతూ ఇండియన్ మిల్లెట్స్ అసోసియేషన్ (ఐఎంఏ) ఉద్దేశం మిల్లెట్స్ ను వాడి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలన్నదే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ బవిషత్ ఆక్షన్ ప్లాన్ ను ప్రకటించారు. కుకింగ్ కాంపిటీషన్స్ నిర్వహించడం, వంటావార్పు కార్యక్రమాన్ని పుస్తక రూపంలో రూపొందించి ప్రజలకు అందజేయడం, అవేర్నెస్ క్యాంపులను నిర్వహించడం, పారిశ్రామిక వాడలను సందర్శించి మిల్లెట్స్ వాడకం గురించి వివరించడం, రైతులకు విత్తనాలు అందించి పంటలు వేయించి కొనుగోలు చేయడం, పాత పంటలను గుర్తు చేయడం ప్రపంచంలో యువత మొట్టమొదటిసారిగా తెలిపారు.

అలాగే రైతులు వ్యాపారస్తు అనుసంధానం చేయడం ,సంవత్సరం పాటు వెల్ఫేర్ గ్రూప్, రైతు సంఘాలు,రైతు ఫెడరేషన్లతో మీటింగ్ ఏర్పాటు చేసి అవఘాన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బేకరీ సీడ్స్ లడ్డు లాంటి తినుబండారాలను కూడా రూపొందించుకోవడానికి క్యాంపులను నిర్వహించబోతున్నామన్నామని తెలిపారు. ఇందుకు గాను మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లా రాష్ట్ర మండల స్థాయిలో ఎగ్జిబిషన్ కూడా పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. తినే వస్తువులు తయారీ మిషన్ కూడా ప్రజలకు అందజేయడం వాటిపట్ల అవఘాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం వ్యాపారస్తులు ఎందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. డ్రై ల్యాండ్ పంటల డెవలప్మెంట్ కూడా వాడుకోవాలని అందుకనుగునంగా అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు గాను ప్రభుత్వం సహాయ సహకారాలు కూడా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో పురం బాల కృష్ణ, మాణిక్యం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, జనవరి 5: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు గురువారం రామగుండం నియోజకవర్గం 2023 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రామగుండం శాసన సభ్యులు కోరుకంటి చందర్, వరంగల్ ఎంపీ రంజిత్ రెడ్డి, ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్, వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిశారు. రామగుండం నియోజకవర్గం గోదావరి ఖని బస్టాండ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. గోదావరిఖనిలో 600 మంది ఆర్టీసీ కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారని వారి కుటుంబాల్లో శుభ కార్యాల కోసం ప్రైవేటు ఫంక్షన్ హాల్, ఆర్టీసీ ద్వారా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని విన్నవించారు.

## సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్ : ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, జనవరి 5: దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలో జిల్లా దివ్యాంగుల ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ. 3వేలు అందిస్తున్నది తెలంగాణ ప్రభుత్వమేనని అన్నారు. దివ్యాంగులను సకలాంగులు పెండ్లి చేసుకుంటే కల్యాణ లక్ష్మితో పాటు అధనంగా రూ. లక్ష అందజేస్తున్నామని పేర్కొన్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవిత సహకారంతో దివ్యాంగులకు త్రీ వీలర్ స్కూటీలు, మోటారైజ్డ్ ట్రైసైకిళ్లు, ఇతర పరికరాలు అందజేస్తున్నామని వెల్లడించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూ దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉందని అన్నారు.

ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజల పైనే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ బందు సత్యం,నాయకులు లంక దాసరి శ్రీనివాస్, అశ్గర్ ఖాన్, ప్రవీణ్,సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ క్రీడా ప్రాంగణాల కోసం స్థలం కేటాయింపులు వెంటనే పూర్తి

### జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్



హైదరాబాద్ జనవరి 5 –ఎక్స్ ప్రెస్ న్యూస్ (:రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ జిల్లా కలెక్టర్లతో పల్లె ప్రకృతివనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాట్లు, జివో నెం. 58,59,76, రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులపై బుధవారం బి.ఆర్.కె.ఆర్ భవన్ నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

పల్లె ప్రకృతివనాలలో మొక్కల సంరక్షణ కోసం పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ క్రీడా ప్రాంగణాల కోసం స్థలం కేటాయింపులు వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై జిల్లాల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.

ముఖ్యంగా జివో నెం. 58,59,76 ల పై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా, జిఏడి కార్యదర్శి శేషాద్రి, సిసి ఎల్ఏ డైరెక్టర్ రజత్ కుమార్ షైనీ, సిసిఎల్ఏ ప్రత్యేక అధికారి సత్యశారద ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసన్నల్లో త్వరలో మరో కొత్త ప్రాంతీయ పార్టీ

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసన్నల్లో సంక్రాంతి తర్వాత మరో కొత్త ప్రాంతీయ పార్టీ రాబోతోందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఏపీ తెలంగాణ సీఎంలు పాలనను గాలికొదిలేశారని విమర్శలు గుప్పించారు. విభజన సమస్యలపై కేంద్ర మీటింగ్‌కు.. ఏపీ వాళ్ళు హాజరైతే, తెలంగాణ వాళ్ళు వెళ్లట్లేదని.. తెలంగాణ వాళ్ళు వెళ్తే, ఏపీ వాళ్ళు వెళ్లట్లేదని మండిపడ్డారు. అవగాహనలో భాగంగానే కృష్ణా, గోదావరి మేనేజ్మెంట్ మీటింగ్‌లకు ఇరు రాష్ట్రాల సీఎంలు హాజరుకావటం లేదని ఆరోపించారు. నీటి పంపకాల విషయంలో ఇద్దరు సీఎంలు పట్టనట్లుగా వ్యహరిస్తున్నారన్నారు. ఇద్దరు సీఎంల తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ కనుసన్నల్లోనే కమ్యూనిస్టులు బీజేపీని తిడుతున్నారని తెలిపారు. ఠాగూర్ వెళ్లినా... ఠాక్రే వచ్చినా కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ కాంగ్రెస్ పార్టీ అవుతుంది అంటూ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.

## కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం : మంత్రి తలసాని

హైదరాబాద్, జనవరి 5:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మాసాబ్ ట్యాంక్‌లోని తన కార్యాలయంలో మన బస్తీ-మన బడి కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించడం కోసం సీఎం కేసీఆర్ ఆదేశాలతో మన బస్తీ- మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 9,123 పాఠశాలలు, హైదరాబాద్ జిల్లాలో 239 పాఠశాలల్లో మన బస్తీ -మన బడి కార్యక్రమం క్రింద అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సన్నబియ్యం తో మధ్యాహ్న భోజనం పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వెల్లడించారు. సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, సాయన్న, కౌసర్ మొహినొద్దిన్, మౌజం ఖాన్, టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ బీజేపీలో ఎలాంటి మార్పులు ఉండదు

### -ప్రస్తుతం ఉన్న టీమ్‌తోనే ఎన్నికలకు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ బీజేపీలో ఎలాంటి మార్పులు ఉండవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న టీమ్‌తోనే ఎన్నికలకు వెళ్తామన్నారు. ఎన్నికలు వస్తే బీజేపీకి ప్రజలే అభ్యర్థులను ఇస్తారని అన్నారు. తమకు నాయకత్వ సమస్య లేదని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో నియంత పాలన సాగుతోందని విమర్శలు గుప్పించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు జరుగుతుంటే కల్వకుంట్ల కుటుంబానికి చెందినవారి పేర్లు బయటపడ్డాయని... దీనితో కేంద్రానికి ఏం సంబంధం?, ప్రధానిపై విమర్శలు ఎందుకు? అని ప్రశ్నించారు. ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేయమని తాము ఆహ్వానించలేదని తెలిపారు. కవిత అరెస్ట్‌ను సీబీఐ చూసుకుంటుందని కేంద్రమంత్రి అన్నారు.




ఆహ్వానం!

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో

దర్పణం సాహిత్య వేదిక నిర్వహణలో

ఆధునిక లఘు కవితా ప్రక్రియల్లో సత్యవీణ మొండ్రేటి గారు రాసిన 'సత్యవాక్కులు' గ్రంథ ఆవిష్కరణ



08.01.2023, మధ్యాహ్నం: 1 గం.

మొదటి అంతస్తు, రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాదు

ముఖ్యఅతిథి, ఆవిష్కర్త: డా. ఏనుగు నరసింహారెడ్డి గారు, ప్రముఖ కవి, విమర్శకులు అదనపు కలెక్టరు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

సభాధ్యక్షులు: డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు గారు, అధ్యక్షులు, దర్పణం సాహిత్య వేదిక

విశిష్ట అతిథులు: పాలడుగు సరోజినీదేవి గారు, సంయుక్త సంచాలకులు, పాఠశాల విద్యాశాఖ
డా. రాధాశ్రీ గారు, ప్రముఖ కవి

పుస్తక సమీక్ష: డా. దీపక్ న్యాతి గారు, ప్రముఖ కవి, రచయిత, నంది అవార్డు గ్రహీత

ఆత్మీయ అతిథులు: సాధనాల వేంకట స్వామి నాయుడు గారు, సినీ గీత రచయిత
గోపాల్ ఆచార్య గారు.సినీ సంగీత దర్శకులు
గంటా మనోహర్ రెడ్డి గారు, ప్రముఖ కవి, రచయిత
కందూరి చంద్రప్రకాష్ గుప్తా గారు, రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, ఎస్.బి.ఐ.
బొగ్గవరపు బ్రహ్మానందం గారు, వ్యవస్థాపకులు, 'విశ్వజనని ఫౌండేషన్'
వెనిశెట్టి రవికుమార్ గారు, 'రోల్ మోడల్' జాతీయ పురస్కార గ్రహీత

కవయిత్రి స్పందన: సత్యవీణ మొండ్రేటి గారు

ప్రారంభ ఉపన్యాసం: డా. చీదెళ్ళ సీతాలక్ష్మి గారు, ప్రధాన కార్యదర్శి, దర్పణం సాహిత్య వేదిక

ఆహ్వానం: ముదిగొండ సంతోష్ గారు, ఉపాధ్యక్షులు, దర్పణం సాహిత్య వేదిక

వందన సమర్పణ: నక్క హరికృష్ణ గారు, కార్యదర్శి, దర్పణం సాహిత్య వేదిక

సభ ప్రారంభానికి ముందు దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షులు రామకృష్ణ చంద్రమౌళి గారు, కవయిత్రి రాధా కుసుమ గారు కవి సమ్మేళనం నిర్వహిస్తారు.

-సమావేశకర్త
డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
ప్రధాన కార్యదర్శి, దర్పణం సాహిత్య వేదిక

# అనాధల ఆక్రందనలు జాతికే శాపాలు

## (06 జనవరి "ప్రపంచ యుద్ధ అనాధల దినం" సందర్భంగా)

యుద్ధాలు ఏ స్థాయిలో జరిగిన అది మిగిల్చే విషాదాలు మాత్రం దీర్ఘకాలం పాటు మానవాళి వెంటాడుతూ పీడిస్తూనే ఉంటాయి. గెలుపోటములు ఎలా ఉన్నా యుద్ధం చేసిన ఇరు పక్షాలు ఆర్థిక నష్టాలతో పాటు జవాన్లు/సామాన్య జనాల మరణాలు, దీర్ఘకాల జబ్బులు, తీవ్ర గాయాలను తలుచుకొని భావోద్వేగ దెబ్బలతో దుఃఖించాల్సిందే. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరుల కుటుంబాలు అనాధాశ్రమాలుగా మారిపోతున్నాయి. అమరవీరుల కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి ఒడువని దుఃఖంతో కన్నీటి సాగరంలో జీవచ్ఛవాల్లా బతుకులు ఈడుస్తుంటారు. కరోనా లాంటి మహావిపత్తుల సమయంలో యుద్ధ అనాధల బతుకులు పుండుపై కారం చల్లినట్లు అవుతున్నదాయి. యుద్ధాలు, జాతి వివక్ష పోరాటాలు, అంతర్గత సంఘర్షనల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాల పిల్లలు అనాధలుగా మిగిలి పోతున్నారు. యుద్ధాలు మిగిల్చిన అనాధలకు చేయూతను ఇవ్వడానికి వేదికగా ప్రతి ఏట 06 జనవరి రోజున 'ప్రపంచ యుద్ధ అనాధల దినం (వరల్డ్ డే ఫర్ వార్ ఆర్ఫన్స్)' నిర్వహిస్తున్నారు. యూనిసెఫ్ వివరణ ప్రకారం 18 ఏండ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలు తల్లితండ్రులను లేదా ఎవరో ఒక్కరిని కోల్పోయినపుడు వారు అనాధలుగా పరిగణించబడతారు.

### రెండు ప్రపంచ యుద్ధాలు – మిలియన్ల అనాధ పిల్లలు:

ఫ్రెంచ్ సంస్థ ఆలోచనలతో ప్రారంభమైన ప్రపంచ యుద్ధ అనాధల దినం వేదికగా అనాధ కుటుంబాలకు మేమున్నామనే ధైర్యాన్ని నూరి పోయడం, ఆర్థిక చేయూతను అందించడం, ఉద్యోగ ఉపాధుల్లో ప్రాధాన్యత ఇవ్వడం లాంటి సేవలను అందించాలి. రెండు ప్రపంచం మిగిల్చిన విషాదాలు అనంతమైనవి. చరిత్ర చవి చూసిన రెండు ప్రపంచ యుద్ధాల్లో మిలియన్ల పిల్లలు అనాధలు అయ్యారు. ప్రతి ఏట యుద్ధ అనాధల సంఖ్య క్రమంగా తగ్గుతూ నేడు ఏడాదికి 0.7 శాతానికి చేరింది. ప్రపంచవ్యాప్తంగా 1990లో 146 మిలియన్ల అనాధలు ఉండగా, 2000లో 155 మిలియన్లు, 2015లో 140 మిలియన్ల యుద్ధ అనాధలు (ఆసియాలో 61 మిలియన్లు, ఆఫ్రికాలో 52 మిలియన్లు, లాటిన్ అమెరికాలో 10 మిలియన్లు, యూరెప్‌లో 7.3 మిలియన్ల అనాధలు) ఉన్నారని తేలింది. యుద్ధ అనాధలను సమాజం చిన్న చూపు చూడడం, శ్రమ దోపిడీ చేయడం, సామాజిక భావోద్వేగ వివక్షలకు గురిచేయడం, మానసికంగా కృంగి పోయేలా ప్రవర్తించడం, లైంగిక హింసలకు గురి చేయడం, బడులకు దూరంగా వెట్టి చాకిరీలో ముంచడం లాంటి అమానవీయ చర్యల్లో చిక్కుకొని దుర్భర బతుకులు అనుభవిస్తున్నారు. 'వార్ జోన్ల'లోని అసంఖ్యాక యుద్ధ అనాధల కష్టాలు మరింత వర్ణణాతీతంగా ఉంటాయి.

యుద్ధ అనాధలను అక్కున చేర్చుకుందాం:

యుద్ధ అనాథల్ని అక్కున చేర్చుకోవడం, ఉచిత విద్య వైద్య సదుపాయాలు కల్పించడం, అర్హత కలిగిన అనాధలకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వడం, మానవీయ కోణంతో వారి కుటుంబాలకు రక్షణ కల్పించడం ప్రభుత్వ, ప్రభుత్వేతర, పౌర సమాజ కనీస బాధ్యతగా భావించాలి. అనాధల వృధులున్న సమాజం నరక సమానమని భావిస్తూ అనాధలకు అమ్మనాన్నలుగా, ఆర్థిక వనరులుగా పౌరసమాజం గొడుగు పట్టాలడానికి వెనకడుగు వేయరాదు. కుటుంబ పెద్దను జాతి హితం కోసం కోల్పోయిన కుటుంబాల అనాధలే అసలైన దేశభక్తులుగా పూజించబడాలి. అనాథల్ని అలక్ష్యం చేసిన సమాజంలో అశాంతి నెలకొనవచ్చని మరువరాదు. అనాధ బాలల బంగారు భవిష్యత్తును ఆదిలోనే తుంచరాదు. పిల్లలు దేవుళ్లతో సమానమని నమ్మిన సమాజంలో అనాధల వెతలకు తావుండ కూడదు. అనాధల ఆక్రందనలు జాతికి శాపాలు, అమానవీయతకు సాక్ష్యాలని గుర్తుంచుకోవాలి. దేశాభివృద్ధిలో యుద్ధ అనాథల్ని భాగస్వాములు చేస్తూ, మానవీయతను వికసింప చేద్దాం.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# టీడీపీ అధినేత చంద్రబాబుకు పోలీసులు చుక్కలు

## –రోడ్ షో కు భలకు అనుమతించని పోలీసులు

చిత్తూరు జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తన సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లాలోని కుప్పంలో పర్యటించేందుకు రెడీ అయిన.. టీడీపీ అధినేత చంద్రబాబుకు పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం చం ద్రబాబు రోడ్షో సభలకు అనుమతి లేదని పోలీసులు నోటీసులు ఇచ్చారు. చంద్రబాబు రోడ్షో సభలకు వెళ్తే కేసులు నమోదు చేస్తామని టీడీపీ నేతలను హెచ్చరించారు. పోలీసుల తీరుపై స్థానిక టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేగా కుప్పంలో ఎక్కడైనా.. సభలు నిర్వహించే హక్కు చంద్రబాబుకు ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. చంద్రబాబు సభ ను టీడీపీ నేతలు జరిపి తీరుతామంటున్నారు. టీడీపీ శ్రేణులను అడ్డుకుంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన లు చేస్తామని టీడీపీ నేతలు హెచ్చరించారు. వాస్తవానికి రాష్ట్రంలో ఇదేం ఖర్మ పేరుతో టీడీపీ నేతలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే విజయనగరం నెల్లూరు జిల్లాల్లో పర్యటించిన చంద్రబాబు.. తాజాగా తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించేందుకు రెడీ అయ్యారు. అయితే.. గుంటూరు కందుకూరు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం సరికొత్త జీవోను తీసుకువచ్చింది. దీని ప్రకారం.. ర్యాలీలు సభలకు కొంత నియంత్రణ ఉంటుంది. ఇదే ఇప్పుడు ఏపీలోనూ సాగుతోంది. కుప్పం పర్యటనకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని.. టీడీపీ నాయకులు.. లేదు టీడీపీ నేతలు తమకు సరైన రోడ్ మ్యాప్ ఇవ్వలేదని పోలీసులు పరస్పరం వాదించుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులు టీడీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. ఒక నిర్దేశిత ప్రాంతంలోనే సభ పెట్టుకోవాలని.. పేర్కొన్నారు.

అయితే ఈ నోటీసులపై టీడీపీ నేతలు స్పందించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పోలీసులు మరో నోటీసు ఇచ్చారు. సమావేశాలకు ఎలాంటి అనుమతి లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు.. ఏదైనా జరిగితే.. దానికి నేతలే బాధ్యత వహించాలని తేల్చి చెప్పారు. అంతేకాదు తగిన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. అయితే.. టీడీపీ నాయకులు మాత్రం షెడ్యూల్ ప్రకారం తమ నాయకుడి కార్యక్రమాలు జరుగుతాయని.. మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# గోవాకు మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్

న్యూఢిల్లీ, జనవరి 5:పూర్వం రక్షణ శాఖ మంత్రి గాను, గోవా కు నాలుగు సార్లు ముఖ్యమంత్రి గాను సేవలను అందించినటువంటి కీర్తి శేషుడు శ్రీ మనోహర్ పర్రికర్ కు శ్రద్ధాంజలి గా గ్రీన్ ఫీల్డ్ ఇంటర్ నేశనల్ ఎయర్ పోర్ట్ మోపా, గోవా కు 'మనోహర్ ఇంటర్ నేశనల్ ఎయర్ పోర్ట్ – మోపా, గోవా' అనే పేరు ను పెట్టేటందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఎక్స్–పోస్ట్ ఫ్యాక్టో ఆమోదాన్ని తెలిపింది.

గోవా రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ను నెరవేర్చడానికి గ్రీన్ ఫీల్డ్ ఇంటర్ నేశనల్ ఎయర్ పోర్ట్, మోపా, గోవా కు 'మనోహర్ ఇంటర్ నేశనల్ ఎయర్ పోర్ట్ –మోపా, గోవా' అనే పేరు ను పెట్టాలని గోవా రాష్ట్ర ప్రభుత్వం యొక్క మంత్రిమండలి సర్వసమ్మతి తో నిర్ణయాన్ని తీసుకొన్నట్లు గోవా ముఖ్యమంత్రి తెలియజేశారు.

గోవా లోని మోపా లో ఏర్పాటైన గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని గౌరవనీయులైన ప్రధాన మంత్రి 2022వ సంవత్సరం డిసెంబర్ లో ప్రారంభించారు.

ఆధునిక గోవా యొక్క నిర్మాణం లో పూర్వ ముఖ్యమంత్రి మరియు భారత ప్రభుత్వం లో ఇదివరకు రక్షణ మంత్రి గా ఉన్న దివంగత డాక్టర్ మనోహర్ పర్రికర్ అందించినటువంటి సేవల కు నమ్మానం గా ఈ విమానాశ్రయాని కి ఆయన పేరు ను పెట్టడం జరిగింది.

# బిసిలు రుణాలకు అర్హులు కారా?

## -బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పగడాల సుదాకర్ ముదిరాజ్

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్ర ప్రభుత్వం అందించే రుణాలకు బిసి లు అర్హులు కారా? అని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పగడాల సుదాకర్ ముదిరాజ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 సంవత్సరం నుండి 2022 – 23 సంవత్సరం వరకు హైదరాబాద్ జిల్లాలో బీసీల అభివృద్ధి మరియు సంక్షేమం కొరకుగాను ఎకనామికల్ సపోర్ట్ స్కీమ్ క్రింద యాభై వెయ్యిల రూపాయల కోసం 2047 మంది దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు కేవలం 969 మందికి రూపాయలు యాభై వేల చొప్పున మంజూరు చేశారన్నారు. 4,84,50000 (నాలుగుకోట్ల ఎనభై నాలుగు లక్షల యైబై వెయ్యిలు) గడచిన ఎనిమిది సంవత్సరాలలో మంజూరు చేశారన్నారు. లక్ష నుండి రెండు లక్షల రూపాయల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 6362 గత ఎనిమిది సంవత్సరాల లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వారి సంఖ్య సున్నా అని తెలిపారు. రెండు లక్షల రూపాయల కంటే ఎక్కువ కొరకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 7284, గడచిన ఎనిమిది సంవత్సరాల లో హైదరాబాదు జిల్లాల పరిధిలో మంజూరు చేసిన వారి సంఖ్య కుడా సున్నా అని అన్నారు. అత్యంత దయనీయమైన విషయం ఏంటంటే బీసీల పట్ల ప్రభుత్వ అత్యంత నిర్లక్ష్య వైఖరికి ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ బీసీ సామాజిక వర్గాలకు లక్ష రూపాయల కంటే ఎక్కువ రుణల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి రుణం ఇవ్వడానికి నియమ నిబంధనలు ప్రభుత్వం. ఇప్పటి వరకు తయారు చేయయాక పోవడం బీసీలను దగా చేయడమే నన్నారు. దాదాపుగా ఏడు ఎనిమిది సంవత్సరాల క్రితం మహిళలు ఐదు లక్షల 77 వేల మంది సబ్సిడీ రుణాల గురించి అప్లై చేసుకోవడం జరిగింది సంవత్సరాలు గడుస్తున్నా కూడా ఇప్పటివరకు సబ్సిడీ రుణాలు ఇప్పటివరకు మహిళలకు అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించగం జరిగిందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు తాల లేక ఎంతోమంది మహిళలు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు మనం చూస్తూనే ఉన్నాం ప్రభుత్వం ఈ రకంగా అయినా రుణాలు కేటాయిస్తే ఏదో ఒక చిన్న వ్యాపారం పెట్టుకొని కుటుంబ పోషించుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చినట్టు అవుతుందన్నారు. చదువుకున్న వాళ్ళకి ఏదో ఒకచోట చిన్న ఉద్యోగమైన దొరుకుతుంది చదువు లేని వాళ్ళు చాలామంది ఉన్నారు రుణాలు ప్రభుత్వం కేటాయిస్తే అయినా వాళ్లకి ఏదో ఒక చిరు వ్యాపారం పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మహిళల గురించి ఆలోచించి ప్రభుత్వం ముందుకు వచ్చి వెంటనే మహిళా రుణాలు కేటాయించాలని మత్త జయంతి ప్రభుత్వాన్నిడిమాండ్ చేసారు.

# ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి, 15మంది కూలీలకు గాయాలు



అమరావతి: జనవరి 5:ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతిచెందగా, మరో 15మంది కూలీలకు గాయాలైన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి జిల్లాలో అమరాపురం మండలం కె.శివరం సమీపంలో చోటుచేసుకుంది. ట్రాక్టర్ బోల్తా బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి చెందగా, 15 మంది కూలీలకు గాయాలయ్యాయి.

పనికోసం వెళ్తూ 15మంది కూలీలు ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్నారు. క్షతగాత్రులను మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ముగ్గురు భార్యలు .. 60 మంది పిల్లలు.. నాలుగో పెళ్లికి రెడీ

న్యూ డిల్లీ జనవరి 5(ఎక్స్ ప్రెస్ న్యూ స్);పాక్ కు చెందిన సర్దార్ హాజీ జాన్ మహమ్మద్(50) ముగ్గురు భార్యలతో ఏకంగా 60 మంది పిల్లలను కన్నాడు. వీరిలో ఐదుగురు పిల్లలు చనిపోగా 55 మంది బ్రతికి ఉన్నారు. అయితే ఈ వ్యక్తి 50 ఏళ్ళ వయస్సులో నాలుగో పెళ్లికి రెడీ అవుతున్నాడు.

తన భార్యలు మరింత మంది పిల్లలు కావాలని కోరుతున్నాడని మమ్మద్ చెప్పడం గమనార్హం. ఇక అతడి పెద్ద కూతురు వయస్సు 22 సంవత్సరాలు కావడం విశేషం.

కాగా కొంతమంది మాత్రం ఒక భార్య ఉండగానే ముగ్గురు నలుగురిని పెళ్లాడుతున్నారు. సంసారం సుఖాన్ని అనుభవిస్తూ వన్ బై వన్ పిల్లలను కంటూ పోతున్నారు. ఇలాంటి వ్యక్తులు తరుచూ వార్తల్లో వ్యక్తులుగా నిలుస్తూ అందరినీ ఆకర్షిస్తుంటారు.

ఇటీవల ఉగాండాకు చెందిన వ్యక్తి 12 మంది భార్యలు.. 100కు పైగా సంతానం 500 పైగా మనువడు.. మనవరాళ్లతో వార్తల్లో నిలిచాడు

.18 యేటే పెళ్లి చేసుకున్న ఈ వ్యక్తి ఏడాదికో భార్య పెంచుకుంటూ పోయాడు. అదే మాదిరిగా ఏకదాటిగా సంతానాన్ని పెంచుకుంటూ పోయాడు. 68 ఏళు పైబడి ఆ వ్యక్తి ఇకపై పిల్లలు కనబోనని ప్రకటించడం గమనార్హం. తన ఆదాయం సరిపడినంతగా లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

రాజుల కాలంలో భర్త ఒక్కడే గానీ ఇద్దరు ముగ్గురు భార్యలు ఉండేవారు. అప్పట్లో మహిళల సంఖ్య ఎక్కువ కాగా పురుషుల సంఖ్య తక్కువగా ఉండేది. ఏ రాజ్యంలో ఎక్కువ జనాభా ఉండే ఆ రాజ్యానిదే యుద్ధ సమయాల్లో పైచేయిగా ఉండేది. కత్తులు కటార్లతో యుద్ధం చేయాల్సి రావడంతో అప్పట్లో జనాభా పెరుగుదల అవశ్యకంగా మారింది. అందుకే నాడు నియామాలు గట్రా ఏమిలేవు. పెళ్లి విషయంలో మాత్రమే సుమ. రాజులు సైతం రాజ్యాలను జయించిన సమయంలో ఓడిపోయిన రాజు కుమార్తెను వివహం ఆడటమో.. లేదా సంధి చర్యల్లో భాగంగా ఇటువంటి తంతు కన్పించేవి. అయితే రాను రాను జనాభా పెరగడం.. కట్టుబాట్లు పెరగడం..

టెక్నాలజీ పెరగడంతో ఒక వ్యక్తికి ఒకే భార్య అనే కాన్సెప్ట్ వచ్చింది.

కొన్ని ముస్లిం దేశాల్లో ఒక వ్యక్తి ఇద్దరు ముగ్గురును నిఖా చేసుకున్నా పర్వాలేదు గానీ హిందు.. క్రిస్టియన్ దేశాల్లో మాత్రం కల్చర్ వేరేలా ఉంది. భారత్ లో ఒక వ్యక్తికి ఒకే భార్య అని చట్టాలు చెబుతున్నాయి. విడాకులు తీసుకుంటే మాత్రం మళ్లి చేసుకోవచ్చు.

ఇక క్రిస్టియన్ దేశాల్లో డేటింగ్ కల్చర్ వచ్చాక పెళ్లి కాన్సెప్టే కనుమరుగయ్యే పరిస్థితులు వచ్చాయి.

అయితే ప్రస్తుతానికి మాత్రం అక్కడ కూడా ఒక వ్యక్తి లీగల్ గా ఒక భార్యను మాత్రవే చేసుకుంటున్నాడు. ఏది ఏమైనా మెజార్టీ భర్తలు మాత్రం ఒకే భార్య కాన్సెప్ట్ కే అలవాటు పడిపోయారు. వీరిలో ఎక్కువ శాతం ఒక్క భార్యతోనే వేగడం కష్టమనే భావనో లేదంటే వారిపై ప్రేమో ఏమో తెలియదు గానీ ఈ నిబంధనకు అలవాటు పడిపోయారు.

# జగన్ ప్రభుత్వ నిర్ణయానికి జేడీ లక్ష్మీనారాయణ అనూహ్య మద్దతు!

అమరావతి జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆంధ్రప్రదేశ్ లో రోడ్లపై బహిరంగ సభలు రోడ్ షోలు ర్యాలీలు నిషేధం విధిస్తూ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్ణయం తీవ్ర వివాదాస్పదమవుతున్న సంగతి తెలిసిందే. దీనిపై ప్రతిపక్షాలు ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ఈ ఉత్తర్వులు తమకేనా వైసీపీకి వర్తించవా అని నిలదీస్తున్నారు. తమ సభలకు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేకే ఈ ఉత్తర్వులు తెచ్చిందని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వానికి ఊహించని వర్గాల నుంచి అనూహ్య మద్దతు లభించింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ జగన్ నిర్ణయానికి మద్దతు తెలిపారు."నాకు ఆ జీవోలో ఏ తప్పు చూడలేదు. ఈ పోలీసు చట్టం 1861లో వచ్చింది. వివిధ రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా ఈ చట్టంలో మార్పులు చేశాయి" అని లక్ష్మీనారాయణ గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వ నిర్ణయం అసాధారణంగా ఏమీ లేదని లక్ష్మీనారాయణ తెలిపారు. బహిరంగ ర్యాలీలు రోడ్షోలు నిర్వహించాలంటే ప్రతి రాజకీయ పార్టీ పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. వారు తమ సమావేశాల వివరాలను తెలియజేస్తే పోలీసులు సరైన ఏర్పాట్లు చేస్తారని వెల్లడించారు. ప్రతి నిర్ణయాన్ని రాజకీయం చేయాల్సిన అవసరం లేదు అని స్పష్టం చేశారు. జీఓలో విధించిన ఆంక్షలు తమకు మాత్రమే వర్తిస్తాయని అధికార పార్టీకి కాదని ప్రతిపక్ష పార్టీలు అభిప్రాయపడితే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు పొందవచ్చని లక్ష్మీనారాయణ తెలిపారు. తెలంగాణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాదిరిగా పోలీసులు అనవసర ఆంక్షలు సృష్టిస్తే ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించవచ్చని అన్నారు. జగన్ బ్రిటీష్ నిబంధనలను పాటిస్తున్నారనే విమర్శలను ప్రస్తావిస్తూ.. ఇది కేవలం పోలీస్ యాక్ట్ మాత్రమే కాదని ఇండియన్ పీనల్ కోడ్ కూడా 1861లో తీసుకొచ్చారని.. బ్రిటీష్ హయాంలోనే అనేక చట్టాలు తీసుకొచ్చారని లక్ష్మీనారాయణ స్పష్టం చేయడం విశేషం."జగన్ ప్రభుత్వం బహిరంగ సభలు లేదా ర్యాలీలను నిషేధించలేదు. పార్టీలు వాటిని పబ్లిక్ గ్రౌండ్స్ లేదా ప్రైవేట్ ప్లేసెస్‌లో నిర్వహించాలని మాత్రమే చెబుతుంది కానీ రోడ్లపై కాదు. అందులో తప్పేమీ లేదు" అని లక్ష్మీనారాయణ అన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# ఢిల్లీలో నేడు, రేపు తేదీల్లో ప్రధాన కార్యదర్శుల రెండో జాతీయ సదస్సుకు అధ్యక్షత వహించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 జనవరి 6, 7 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల రెండో జాతీయ సదస్సుకు అధ్యక్షత వహిస్తారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించే దిశగా ఇది మరో కీలక ముందడుగు కానుంది. కాగా, 2022 జూన్‌లో ప్రధాన కార్యదర్శుల తొలి సదస్సు ధర్మశాలలో జరిగింది. అయితే, ఈ ఏడాది 2023 జనవరి 5 నుంచి 7వ తేదీవరకూ మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాలతో భాగస్వామ్యంద్వారా సుస్థిర, సువేగ ప్రగతి సాధనపై సదస్సు ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతోపాటు అన్ని రాష్ట్రాల/కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఇతర సీనియర్ అధికారులు, ఆయా రంగాల నిపుణులు మొత్తం 200 మంది ఈ సదస్సులో పాల్గొంటారు. వృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పన, సమ్మిళిత మానవాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ వికసిత భారత నిర్మాణ లక్ష్యాన్ని సాధించే దిశగా సహకారాత్మక కార్యాచరణకు ఈ సదస్సు పునాది వేస్తుంది.

నోడల్ మంత్రిత్వ శాఖలు, నీతి ఆయోగ్, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు, వివిధ రంగాల నిపుణుల మధ్య మూడు నెలలుగా నిర్వహించిన 150కిపైగా ప్రత్యక్ష–వర్చువల్ సంప్రదింపుల సమావేశాల్లో విస్తృత చర్చల తర్వాత ఈ జాతీయ సదస్సు చర్చనీయాంశాలు నిర్ణయించబడ్డాయి. తదనుగుణంగా గుర్తించబడిన ఆరు ఇతివృత్తాలు– (తి) 'ఎంఎస్ఎంఇ'లకు ప్రాధాన్యం; (తితి) మౌలిక సదుపాయాలు–పెట్టుబడులు; (తితితి) కనిష్ఠ షరతులు; (తిల) మహిళా సాధికారత; (ల) ఆరోగ్యం–పోషకాహారం; (లతి) నైపుణ్యాభివృద్ధి వగైరాలపై ఈ సదస్సు ప్రధానంగా చర్చిస్తుంది.

అలాగే (తి) వికసిత భారతం: చివరి అంచెకు చేరిక; (తితి) ఐదేళ్ల వస్తుసేవల పన్ను (జీఎస్టీ).. ఆచరణ–అనుభవాలు; (తితితి) ప్రపంచ భౌగోళిక–రాజకీయ సవాళ్లు–భారత్ ప్రతిస్పందన ప్రధానాంశాలుగా మూడు ప్రత్యేక చర్చాగోష్ఠులు నిర్వహించబడతాయి.

అంతేకాకుండా నాలుగు ప్రధానాంశాలు? (తి) స్థానికత కోసం స్వగళం; (తితి) అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరం; (తితితి) జి20: దేశాల పాత్ర; (తిల) వర్ధమాన సాంకేతికతలపై కేంద్రీకృత చర్చలు జరుగుతాయి.

వీటితోపాటు రాష్ట్రాలు పరస్పరం నేర్చుకునేలా ప్రతి ఇతివృత్తం క్రింద రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఉత్తమాచరణలపైనా సమావేశంలో ప్రత్యేక ప్రస్తావనలుంటాయి.

ప్రస్తుత ప్రధాన సదస్సుకు ముందు ప్రధానమంత్రి ఆదేశాలకు అనుగుణంగా–రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలతో మూడు వర్చువల్ కాన్ఫరెన్సులు నిర్వహించబడ్డాయి. ఇందులో భాగంగా (తి) జిల్లాలు కేంద్రకంగా అభివృద్ధి; (తితి) వృత్తాకార ఆర్థిక వ్యవస్థ; (తితితి) ఆదర్శ కేంద్రపాలిత ప్రాంతాలు ప్రధానాంశాలుగా నిర్వహించిన ఈ వర్చువల్ సమావేశాల నిర్ణయాలు కూడా ప్రధాన కార్యదర్శుల జాతీయ సదస్సులో ప్రముఖంగా ప్రస్తావనకు వస్తాయి.

# 89కేసుల్లో వాంటెడ్ స్మగ్లింగ్ బ్రదర్స్ అరెస్ట్..



తిరుపతి, జనవరి 5: వివిధ జిల్లాల్లో దాదాపు 89కేసులున్న వాంటెండ్ స్మగ్లర్లను అరెస్టు చేసి, 31ఎర్రచందనం దుంగలు, ఆరు సెల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ? వీరిద్దరిని కడప జల్లా చాపాడు మండలానికి చెందిన షేక్ చెంపతిలాల్ బాషా (36), షేక్ చంపతి జాకీయర్ (27)లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిద్దరూ సోదరులని, వీరు గత కొన్ని సంవత్సరాలుగా ఎర్రచందనం స్మగ్లింగ్ కు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు. వీరి కోసం కొంతకాలంగా చేపట్టిన వ్యూహం ప్రకారం అరెస్టు చేసినట్లు తెలిపారు. డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ చక్రవర్తి అద్వర్యంలో సీఐ రామకృష్ణ, ఆర్ఐ చిరంజీవులు టీమ్ ఏర్పేడు సమీపంలోని కృష్ణాపురం, మల్లెమడుగు, కరకంబాడి ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు.

కరకంబాడి ఫారెస్ట్ బీట్ అమర్ రాజా ఫ్యాక్టరీ విన్జియో కంపెనీ వద్ద కారుతో నిలబడి ఉన్నవారు గమనించారు. వీరిని సమీపించడంతో పారిపోవడానికి ప్రయత్నించారు. ఆర్ఎస్ఐ రాఘవేంద్ర మరికొంత మంది పోలీసులు చుట్టుముట్టి పట్టుకోగలిగారు. వీరిని అంతర్రాష్ట్ర స్మగ్లర్లుగా గుర్తించారు. వీరి నుంచి 31ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నారు. కారులో పోలీసు యూనిఫాంను కూడా కనుగొన్నారు. వీరు పోలీసు యూనిఫాం వేసుకుని స్మగ్లింగ్ కు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను హైజాక్ చేసి, ఇతర రాష్ట్రాలకు అమ్మేవారని తెలిపారు. 31ఎర్రచందనం దుంగల విలువ రూ.20లక్షలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ, రామకృష్ణ, ఎఫ్ఆర్వోలు, ఎస్ఐ ఉన్నారు.

# ఆనంకు అధిష్టానం పొమ్మనకుండా పొగబెట్టిందా?

అమరావతి జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆనం బ్రదర్స్లో వివేకానందరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక ఆనం రామనారాయణరెడ్డి మాత్రం ప్రస్తుతం వైసీపీలోఉన్నారు. ఇక ఇప్పుడు ఆయనకు అధిష్టానం పొగబెట్టింది. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆనం ముందు ఉన్న దారులు ఏవీ? అనే చర్చ తెరమీదికి వచ్చింది. ప్రస్తుతం ఉన్న అంచనాల మేరకు రెండు మార్గాలు ఆనం ముందు ఉన్నాయని అంటున్నారు పరిశీలకు లు. ఒకటి.. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీడీపీలోకి వెళ్లడం.. రెండు ఎన్నికల మాట ఎలా ఉన్నా.. రాజకీయంగా ఉంటే చాలని అనుకుంటే బీఆర్ ఎస్ వైపు మళ్లడం. ఈ రెండు కాకుండా.. మరో మార్గం ఆయనకు లేదు. లేకపోతే.. బీజేపీలో కి వెళ్లే ప్రయత్నం చేసినా.. నెల్లూరులో బీజేపీ హవా పెద్దగా లేదు. ఈ పరిణామాలను గమనిస్తే.. ఎక్కువ భాగం.. ఆనం టీడీపీలోకి రీఎంట్రీ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు వరకు కాంగ్రెస్లో ఉన్న ఆనం.. తర్వాత 2014 ఎన్నికల్లో దూరంగా ఉన్నారు. తర్వాత టీడీపీలోకి వచ్చారు. ఈ క్రమంలోనే ఆయన నామినేటెడ్ పదవిని ఆశించారు. అయితే.. అది దక్కలేదు. పైగా సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి బీద సోదరుల ఎఫెక్ట్తో ఆయన రాజకీయంగా నలిగిపోయారు. ఈ క్రమంలో వైసీపీలోకి వచ్చారు. వెంకటగిరి టికెట్పై గెలిచారు. కానీ తనకు తాను చేసుకున్న తీసుకు న్న గొయ్యి కారణంగా.. ఇప్పుడు పార్టీ నుంచి బయటకు రావాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఇక ఈ క్రమంలో ఆనం.. టీడీపీవైపు వెళ్తే.. అంతో ఇంతో ప్రయోజనం ఉంటుంది. ఆయన కోరుకుంటున్న ఆత్మకూరు నియోజకవర్గం దక్కుతుందా? లేదా.. అన్నది పక్కన పెడితే.. గెలుపు గుర్రం ఎక్కేందుకు అవకాశం ఉంటుంది. ఇది కాదని బీఆర్ ఎస్ బాట పడితే.. ఆర్థికంగా పరిస్థితి బాగానే ఉన్నా.. రాష్ట్రంలో ఈ పార్టీ పరిస్థితి ఏంటనేది మాత్రం ఒకింత సందేహమే!

# ఏపిలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఇంటెలిజెన్స్ బృందాలు

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చి దేశ రాజకీయాల్లో తన సత్తా చూపాలని భావిస్తున్నారు.. తెలంగాణ సీఎం కేసీఆర్. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా తన పార్టీని విస్తరించడానికి ఆయన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ నుంచి మాజీ అఖిల భారత సర్వీసు అధికారులు తోట చంద్రశేఖర్ రావెల కిశోర్ బాబు చింతల పార్థసారథి వంటి వారిని బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు.

ఈ క్రమంలో తోట చంద్రశేఖర్ ను ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా చేశారు. అలాగే రావెల కిశోర్ బాబు. బీఆర్ఎస్ జాతీయ వ్యవహారాల ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఏపీలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన ఫలితాలు సాధించాలని కేసీఆర్ ఆశిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి పది ఇంటెలిజెన్స్ బృందాలు ఏపీలో తిరుగుతున్నట్టు టాక్ నడుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో ఉన్న అభిప్రాయం వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేయాలనుకుం టున్నారు? ప్రతిపక్ష పార్టీల పరిస్థితి ఇలా వివిధ అంశాలను తెలంగాణ ఇంటెలిజెన్స్ బృందాలు ఆరా తీస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే బీఆర్ఎస్ ఏపీలోకి ప్రవేశిస్తే ప్రజలు ఆదరిస్తారా? కేసీఆర్ పై ఏపీ ప్రజల్లో ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయి? బీఆర్ఎస్ గురించి ఏమనుకుంటున్నారు ఇలా అన్ని విషయాలను తెలంగాణ ఇంటెలిజెన్స్ బృందాలు సేకరిస్తున్నట్టు టాక్ నడుస్తోంది. ఇప్పటికే పది బృందాలు రాష్ట్రం మొత్తం తిరుగుతున్నాయని చెబుతున్నారు. ఉత్తరాంధ్ర రాయలసీమ కోస్తాంధ్ర తదితర ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజల నుంచి వివిధ అంశాలపై ఇంటెలిజెన్స్ బృందాలు సమాచారం సేకరిస్తున్నాయని అంటున్నారు. గతంలో ఇలాగే ఏపీ ఇంటెలిజెన్స్ బృందాలు తెలంగాణలో పర్యటించినప్పుడు తెలంగాణ ప్రభుత్వం వారిని అడ్డుకుంది. అయితే ఇప్పుడు అదే పనిని కేసీఆర్ ప్రభుత్వం ఏపీలో చేస్తోందని అని అంటున్నారు. అయితే ఏపీలో జగన్ ప్రభుత్వంతో కేసీఆర్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఇంటెలిజెన్స్ బృందాలు నేరుగా రంగంలోకి దిగినా లేదంటే తమ అనుమతితో రంగంలోకి దిగినా జగన్ ప్రభుత్వానికి పెద్ద అభ్యంతరాలేమీ ఉండబోవని చర్చ జరుగుతోంది.

# టోల్ ప్లాజా సిబ్బందిపై బీఆర్ ఎస్ ఎమ్మెల్యే దాడి

మంచిర్యాల జనవరి 5(ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో అధికార పార్టీ బీఆర్ ఎస్ ఎమ్మెల్యే వివాదంలో చిక్కుకున్నారు. తన కారుకు టోల్ రుసుము చెల్లించమని కోరిన టోల్ గేట్ సిబ్బందిపై ఆయన దాడిచేసినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి టోల్ప్లాజా సిబ్బందిపై బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య దాడికి దిగారు. గత నెలలో ప్రారంభమైన మందమర్రి టోల్ప్లాజా వద్ద వాహనదారుల నుంచి టోల్ రుసుము వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఎమ్మెల్యే వాహనం అక్కడకు చేరుకోగానే టోల్ప్లాజా సిబ్బంది టోల్ రుసుము చెల్లించాలని కోరారు. ఈ క్రమంలో ఒకింత దురుసుగా వ్యవహరించారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే కారు దిగి.. రహదారి పనులు అసంపూర్తిగా ఉండగానే ప్రజల నుంచి టోల్ ఛార్జీలు ఎలా వసూలు చేస్తారంటూ సిబ్బందిపై దాడికి దిగారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి.

నా తప్పు లేదు:ఎమ్మెల్యే ఈ ఘటనపై ఎమ్మెల్యే చిన్నయ్య స్పందించారు. టోల్ప్లాజా సిబ్బందే తన పట్ల దురుసుగా ప్రవర్తించారని స్పష్టం చేశారు. ''నేను ఎవరిపై దాడి చేయలేదు. రోడ్డు నిర్మాణం పూర్తి కాకున్నా టోల్ వసూల్ చేయడాన్ని ప్రశ్నించాను. టోల్గేట్ సిబ్బంది ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అంబులెన్సును కూడా ఆపేసి సతాయిస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదు. నన్ను టోల్ ప్లాజా ఓపెనింగ్కు కూడా పిలవలేదు. రోడ్డును పూర్తి చేశాకే టోల్ వసూలు చేయాలి'' అని ఎమ్మెల్యే చిన్నయ్య పేర్కొన్నారు. మొత్తానికి ఈ వివాదం ఎటు దారి తీస్తుందో చూడాలి.

# నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 5:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కు ఆమోదం తెలిపింది. ఈ మిషన్ ప్రారంభ వ్యయం రూ. 19,744 కోట్లు కాగా, ఇందులో సైట్ (ఎస్ ఐ జి హెచ్ టి) కార్యక్రమానికి రూ. 17,490 కోట్లు, పైలట్ ప్రాజెక్టులకు రూ. 1,466 కోట్లు, పరిశోధన, అభివృద్ధి కోసం రూ. 400 కోట్లు, ఇతర మిషన్ భాగాలకు రూ. 388 కోట్లు కేటాయించారు. సంబంధిత కాంపోనెంట్ ల అమలు కోసం ఎంఎన్ ఆర్ ఈ పథకం మార్గదర్శకాలను రూపొందిస్తుంది.

గ్రీన్ హైడ్రోజన్ , దాని ఉత్పన్నాలకు ఎగుమతి అవకాశాలను సృష్టించడం వంటి విస్తృత ప్రయోజనాలను మిషన్ కలిగి ఉంటుంది; పారిశ్రామిక, చలనశీలత , ఇంధన రంగాల డీకార్బోనైజేషన్; దిగుమతి చేసుకున్న శిలాజ ఇంధనాలు,ఫీడ్ స్టాక్ పై ఆధారపడటాన్ని తగ్గించడం; దేశీయ తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం; ఉపాధి అవకాశాల కల్పన; ఇంకా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి. భారతదేశ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యం సంవత్సరానికి కనీసం 5 మిలియన్ టన్నులకు చేరుకునే అవకాశం ఉంది, అనుబంధ పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని సుమారు 125 గిగావాట్లను జోడిస్తుంది. 2030 నాటికి రూ. 8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని, 6 లక్షలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. 2030నాటికి సంవత్సరానికి దాదాపు 50 ఎంఎంటి కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను నివారించవచ్చని భావిస్తున్నారు.

గ్రీన్ హైడ్రోజన్ కు డిమాండ్ సృష్టించడం, ఉత్పత్తి, వినియోగం , ఎగుమతిని ఈ మిషన్ సులభతరం చేస్తుంది. గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ ప్రోగ్రామ్ కోసం వ్యూహాత్మక ఇంటర్వెన్షన్స్ (ఎస్ ఐ జి హెచ్ టి) కింద, ఎలక్ట్రోలైజర్ల దేశీయ తయారీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని లక్ష్యంగా చేసుకుని రెండు విభిన్న ఆర్థిక ప్రోత్సాహక యంత్రాంగాలు మిషన్ కింద అందించబడతాయి. అభివృద్ధి చెందుతున్న తుది వినియోగ రంగాలు, ఉత్పత్తి మార్గాలలో పైలట్ ప్రాజెక్టులకు కూడా మిషన్ మద్దతు ఇస్తుంది. పెద్ద ఎత్తున హైడ్రోజన్ ఉత్పత్తి మరియు/లేదా వినియోగానికి మద్దతు ఇవ్వగల ప్రాంతాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్ లుగా గుర్తిస్తారు. అభివృద్ధి చేస్తారు.

గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్ స్థాపనకు మద్దతు ఇవ్వడానికి వీలైన విధాన యంత్రాంగాన్ని అభివృద్ధి చేస్తారు. దృఢమైన ప్రమాణాలు ,నిబంధనల ఫ్రేమ్ వర్క్ ను కూడా అభివృద్ధి చేస్తారు. ఇంకా, ఈ మిషన్ పరిశోధన–అభివృద్ధి (వ్యూహాత్మక హైడ్రోజన్ ఇన్నోవేషన్ పార్టనర్ షిప్ – షిప్) కోసం ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య ఫ్రేమ్ వర్క్ ను సులభతరం చేస్తుంది; ఆర్ అండ్ డి ప్రాజెక్టులు లక్ష్య–ఆధారితమైనవి, కాలపరిమితితో కూడినవి. ప్రపంచవ్యాప్తంగా పోటీ సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడానికి తగిన విధంగా ఉంటాయి.

మిషన్ లక్ష్యాలను విజయవంతంగా సాధించడానికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ఏజెన్సీలు,సంస్థలు కేంద్రీకృత ,సమన్వయ చర్యలు తీసుకుంటాయి. మిషన్ మొత్తం సమన్వయం,అమలు కు నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ బాధ్యత వహిస్తుంది.

# మరోసారి దుర్గమ్మ గుడి వ్యవహారం వివాదాస్పదం

## –అమ్మవారి మూల విరాట్ వీడియోలు వైరల్

విజయవాడ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇప్పుడు ఇదే కోవలో మరోసారి దుర్గమ్మ గుడి వ్యవహారం వివాదాస్పదమవుతోంది. ఎవరో వ్యక్తులు గర్భగుడిలోని మూలవిరాట్ ను వీడియో తీశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీంతో దుర్గమ్మ గుడిలో భద్రత కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఒక్కసారిగా ఆలయ అధికారులు ఉలిక్కిపడ్డారు. విచారణలో ఇది డిసెంబర్ 22న తీసిన వీడియో అని స్పష్టమైంది. వాస్తవానికి కనకదుర్గ ఆలయంలోనికి సెల్ ఫోన్లు తీసుకువెళ్లడం నిషేధం. దర్శనానికి వెళ్లబోయే ముందు ఆలయం వెలుపల ఉన్న కౌంటర్ల వద్దే సెల్ ఫోన్లను భద్రపర్చుకోవాల్సి ఉంటుంది. కొండపైకి వెళ్లడానికి ముందే ఆలయం క్రిందనే మొబైల్ ఫోన్లను భద్రపరచడానికి ప్రత్యేక కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా భక్తులు దర్శనానికి వెళ్లే సమయంలో కూడా సెక్యూరిటీ సిబ్బంది అన్ని తనిఖీలు చేశాకే భక్తులను లోనికి అనుమతిస్తారు. సెల్ ఫోన్లు ఇతర పరికరాలు ఏమైనా లభిస్తే భక్తులను వెనుకకు పంపించేస్తారు. అలాంటిది అమ్మవారి మూల విరాట్ ను వీడియో తీయడం దాన్ని వైరల్ చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంపై కనకదుర్గ ఆలయ అధికారుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరో ఫోన్లతో అమ్మవారి మూల విరాట్ ను వీడియోలు తీస్తుంటే అధికారులు ఆలయ సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనలను చూసైనా మారకపోతే ఎలా అని నిలదీస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే అమ్మవారి గుడిలో భద్రత లేశమాత్రమైనా లేదనేది తేటతెల్లమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అలర్ట్ అయిన ఆలయ అధికారులు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా సీసీ టీవీ ఫుటేజ్ ను పరిశీలించారు. డిసెంబర్ 22వ తేదీన ఒక మహిళ అమ్మవారి అంతరాలయాన్ని వీడియో తీసినట్లుగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి సెక్యూరిటీ సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా దుర్గ గుడి ఈవో భ్రమరాంబ దీనిపై విచారణకు ఆదేశించారు. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా వీడియో చిత్రీకరించిన ఘటనపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ గుడి విజయవాడలో చాలా పాపులర్. నిత్యం రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కాగా గతంలో దుర్గమ్మ గుడిలో క్షుద్ర పూజలు జరిగాయని అమ్మవారి వెండి సింహాసనం మాయమైందని ఇలా పలు రకాలుగా వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అమ్మవారి చీరల వ్యవహారం నగదు లెక్కింపులో దేవాలయ సిబ్బంది చేతివాటానికి సంబంధించి కూడా ఆధారాలు లభించాయి. దీంతో పలువురు ఉద్యోగులను విధుల నుంచి కూడా తప్పించారు. ఈ అంశాలు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి.

# హైకోర్టు డివిజన్ బెంచ్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసు

## కేసీఆర్ సర్కార్ నిర్ణయం

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీజేపీతో ఫైట్ లో ఎక్కడా తగ్గకూడదని కేసీఆర్ సర్కార్ డిసైడ్ అయ్యింది. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సంచలన నిర్ణయం తీసుకుంది.

విచారణను సీబీఐకి అప్పగించాలన్న హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుపై అప్పీల్ కు వెళ్లింది. ఇటీవలే సిట్ దర్యాప్తును రద్దు చేస్తూ కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దీనిపై అప్పీల్ కు వెళ్లాలని కేసీఆర్ ప్రభుత్వం డిసైడ్ అయ్యింది. దీంతో కేసు హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణకు వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

ఇటీవల హైకోర్టు ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో కేసీఆర్ సర్కార్ కు షాకిచ్చింది. నలుగురు భారత్ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన కేసును తెలంగాణ హైకోర్టు.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు అప్పగించడంతో కేసు ఆసక్తికర మలుపు తిరిగింది. భారతీయ జనతా పార్టీ నాయకత్వాన్ని బట్టబయలు చేయడంలో అత్యుత్సాహం కారణంగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ఇప్పుడు మంచి అవకాశాన్ని చేజార్చుకున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ సీఎం కేసీఆర్ ఈ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో చిక్కులు తప్పవని ప్రముఖ బ్యూరోక్రాట్ సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సైతం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు ముగ్గురు నిందితుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన వీడియోలు ఆడియోలు ఇతర పత్రాలతో సహా దర్యాప్తు అంశాలు ముఖ్యమంత్రికి ఎలా చేరాయనే కీలకమైన అంశాన్ని హైకోర్టు న్యాయమూర్తి బీ విజయసేన్ రెడ్డి తన తీర్పులో లేవనెత్తారు. ముఖ్యమంత్రికి ఎవరు ఆధారాలు ఇచ్చారనే ప్రశ్నలకు ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు సమాధానం చెప్పలేకపోయారని న్యాయమూర్తి గమనించారు. ఇక సిట్ దర్యాప్తు సరిగాలేదని.. పేర్కొన్న హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించడానికి 45 కారణాలను చూపించింది. అయితే బీజేపీ విషయంలో ఎక్కడ తగ్గకూడదని.. ఈ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిక్కచ్చిగా ఉండాలని.. అందుకే అవసరమైతే హైకోర్టుకు.. సుప్రీంకోర్టుకు కూడా వెళ్లాలని కేసీఆర్ సర్కార్ పట్టుదలతో ఉంది.

# ఘనంగా తెప్పోత్సవం వేడుక

తిరుపతి, జనవరి 5:ఘనంగా తెప్పోత్సవ వేడుకలు జరిగాయి. తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న తెప్పోత్సవాల్లో భాగంగా శ్రీ కామాక్షి అమ్మవారు తెప్పలపై భక్తుల దర్శనం ఇచ్చారు. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై అమ్మవారు కపిలతీర్థం పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు అందించారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో పార్థసారథి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రణాళిక బద్ధంగా డివిజన్ల అభివృద్ధి : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

మెదక్, జనవరి 5: నేటినిజం (ప్రతినిధి): బల్దియ పరిధిలోని డివిజన్లను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీ నగర్ కాలనీలో 16 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. పటాన్ చెరు డివిజన్ పరిధి, లో సీసీ రోడ్ల నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం ఇటీవల ఐదు కోట్ల రూపాయల



నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, రామచంద్రపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, భారత్ రాష్ట్ర సమితి పట్టణ అధ్యక్షులు అఫ్జల్, బండ్లగూడ ఏరియా అధ్యక్షులు గోపాల్, కొమరగూడెం వెంకటేష్, చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా..

## పాల్గొన్న ఎమ్మెల్యే రఘునందన్ రావు



కామారెడ్డి, జనవరి 5: (నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘునందన్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మాస్టర్ ప్లాన్ లో తమ భూములు పోతున్నాయని తీవ్ర మనోవేదనకు గురైన అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ రైతు పయ్యావుల రాములు బుధవారం ఆత్మహత్యకు పాల్పడగా రైతులు నిరసన వ్యక్తం చేశారు. మరుసటి రోజు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాస్టర్ ప్లాన్ లో రైతుల భూములను కుట్రపూరితంగా ఇండస్ట్రియల్ జోన్ లోకి తెచ్చారని రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వానికి, కేసీఆర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ బయటకు రావాలని బీజేపీ నాయకుడు ధర్నాలో మాట్లాడుతూ హెచ్చరించారు. ధర్నా కొనసాగుతోంది.

# సహకారశాఖ ప్రాధాన్యం పెరిగింది..

## సహకార సంఘాలు బలోపేతం కావాలి

### –వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : సహకారశాఖ ప్రాధాన్యం పెరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గృహకల్ప లో బుధవారం తెలంగాణ సహకార గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార శాఖ ఉద్యోగులకు నిరంతర శిక్షణలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న సంపద దుర్వినియోగం కాకుండా కాపాడాలన్నారు. సాగునీటి రాకతో గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సహకార శాఖ ప్రాధాన్యం పెరిగిందన్న ఆయన.. నీటి వృథాను అరికట్టడం, సాగు చేయాల్సిన పంటల రకాల మీద రైతులను చైతన్యం చేసే బాధ్యత సహకార శాఖ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిరంగంలో మనుషుల మధ్య సంబంధాలను పెంచేందుకు కృషిచేయాలని, సహకార సంఘాలు బలోపేతం కాకుంటే కార్పోరేట్ వ్యవస్థ వేళ్లూనుకుంటుందని హెచ్చరించారు. దాంతో సమాజానికి నష్టం చేకూరుతుందన్నారు. గతంలో సహకార సంఘాల్లో ఉద్యోగుల జీతాలకు ఇబ్బందులుండేవని, తెలంగాణ ఏర్పాటు తర్వాత సహకార సంఘాలు బలోపేతమయ్యాయన్నారు. సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహకార ఉద్యోగులు కేరళలోని సహకార సంఘాలను అధ్యయనం చేయాలని సూచించారు.

# విద్యార్థులు అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలి

## –ఒలంపియాడ్ పరీక్షలో 58 మంది విద్యార్థులు ప్రతిభ

## –శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ సుదేష్ కుమారి




రాజన్న సిరిసిల్ల, జనవరి 5:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యంతోముందుకు వెళ్ళినప్పుడే విజయాలు సాధిస్తారని వేములవాడ శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ బి సు దేష్ కుమారి అన్నారు. వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలోని విద్యార్థులకు నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలో 58 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటి విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్లో ప్రతిభా చాటిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సు దేష్ కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక సబ్జెక్టులో నైపుణ్యం ఉంటుందని, దానిని విద్యార్థి సాధన చేసినప్పుడే అది బయటపడుతుందని, అందుకు ప్రతి ఒక్కరు కృషిచేసి వారిలో ఉన్న తెలివితేటలను చూపించాలని అన్నారు. ఒలంపి యాడ్ లో ప్రతిభ చాటినందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, రీజినల్ ఇన్చార్జి ముద్రకోల రాజు, ప్రిన్సిపాల్ సుదేష్ కుమారిపుష్పగుచ్చాలతోపాటు జ్ఞాపికాలను అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీన్ పీ శేఖర్, ఒలంపియాడి ఇంచార్జ్ కె .అరుణ్ కుమార్, ఏవో ఏ. సుధీర్, విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన బడి పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, జనవరి 5: (నేటి నిజం ప్రతినిధి): మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని హంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా తో కలిసి మన ఊరు మనబడి పనుల పురోగతి, ఎఫ్టిఓల జనరేట్, మోడల్ స్కూల్స్ పనుల పురోగతి, తదితర అంశాలపై విద్య, ఇంజనీర్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే పూర్తయిన సివిల్ వర్క్స్ తో పాటు పెయింటింగ్, సంప్, టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, ఫ్లోరింగ్ , ఫినిషింగ్, తదితర పనులు సొంత ఇంటి పని తరహాలోనే పాఠశాలల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన ఉండేలా చొరవ చూపాలని సంబంధిత ఎంఈఓలకు సూచించారు. మన ఊరు మనబడిలో చేపట్టిన మోడల్ స్కూల్స్ ను ఈ నెల 13 లోగా అన్ని హంగులతో పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే పనుల్లో జాప్యం జరిగిందని, పనులను నాణ్యతతో చేపడుతూ సత్వరమే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులలో జాప్యంపై పలు నియోజకవర్గాల ఈఈలు,

డిఈల పని తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. వచ్చేవారం వరకు చూస్తానని, అప్పటికి పురోగతి లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తయిన పనులకు వెంట వెంటనే ఎఫ్టిఓ (ఫండ ట్రాన్స్ఫర్ ఆర్డర్స్) లను అప్లోడ్ చేయాలని సూచించారు. పాఠశాల పెయింటింగ్ అంశంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం సూచించిన కలర్ కోడ్ రంగులు వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేష్, ఇంజనీరింగ్ శాఖల ఈఈలు, డిఈలు, ఎంఈఓలు, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

# ఏపీలో ఏమైనా ఎమర్జెన్సీ విధించారా?.

## –సీఎం జగన్ పై నారా లోకేష్ ఫైర్

అమరావతి జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సీఎం జగన్ రెడ్డి పై టీడీపీ నేత నారా లోకేష్ ఫైర్ అయ్యారు. "రాష్ట్రం నీ జాగీరా జగన్ రెడ్డి. ఏపీలో ఏమైనా ఎమర్జెన్సీ విధించారా?. కుప్పంలో వైసీపీ పోలీసులు అప్రకటిత యుద్ధం ప్రకటించారు" అని లోకేష్ వ్యాఖ్యానించారు. బ్రిటిష్ చట్టానికి బూజు దులిపి అర్ధరాత్రి జీవో తెచ్చారని పేర్కొన్నారు. కాగా చిత్తూరు జిల్లాలోని శాంతిపురం మండలం గడ్డూరులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కు స్వాగతం పలికేందుకు వెళ్తున్న టీడీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. చంద్రబాబు పర్యటనకు ఎవరూ వెళ్లకూడదని అడ్డగించారు. చంద్రబాబు రోడ్‌షో, సభకు అనుమతిలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసుల బారికేడ్లను టీడీపీ కార్యకర్తలు ఎత్తిపడేసి ఆందోళనకు దిగారు.

చారా?. కుప్పంలో వైసీపీ పోలీసులు అప్రకటిత యుద్ధం ప్రకటించారు" అని లోకేష్ వ్యాఖ్యానించారు. బ్రిటిష్ చట్టానికి బూజు దులిపి అర్ధరాత్రి జీవో తెచ్చారని పేర్కొన్నారు. కాగా చిత్తూరు జిల్లాలోని శాంతిపురం మండలం గడ్డూరులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కు స్వాగతం పలికేందుకు వెళ్తున్న టీడీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. చంద్రబాబు పర్యటనకు ఎవరూ వెళ్లకూడదని అడ్డగించారు. చంద్రబాబు రోడ్‌షో, సభకు అనుమతిలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసుల బారికేడ్లను టీడీపీ కార్యకర్తలు ఎత్తిపడేసి ఆందోళనకు దిగారు.

# ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ వైఫల్యాలపై చార్జ్‌షీట్: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ వైఫల్యాలపై చార్జ్?షీట్ విడుదల చేస్తున్నామని టీపీసీసీ చీఫ్ రేవంత్?రెడ్డి పేర్కొన్నారు. నిపుణుల సూచనలతో భవిష్యత్ కార్యాచరణ రూపొందిద్దామన్నారు. తెలంగాణలో నిరంకుశ పాలన కొనసాగుతోందన్నారు. నిరంకుశ పరిస్థితుల నుంచి విముక్తి కల్పించేది కాంగ్రెస్ మాత్రమేనని.. బండ్లతోని, గుండ్లతోని అయ్యేది ఏం లేదని రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఓటరు జాబితాలో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని రేవంత్ పేర్కొన్నారు. ధరణితో లక్షలాది మంది సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దేశానికి మంచి నాయకత్వాన్ని సోనియా అందించారన్నారు. ఎముకలు కొరికే చలిలో సైతం రాహుల్ జోడో యాత్ర చేస్తున్నారని కొనియాడారు. జనవరి 26న జెండా ఎగరేయడంతో బాధ్యత తీరలేదన్నారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రతి గడపకు రాహుల్?గాంధీ సందేశాన్ని చేరవేస్తామని రేవంత్?రెడ్డి ప్రకటించారు.

# వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావుతో అమెరికా డాక్టర్ల బృందం భేటీ



హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో బీఆర్ఎస్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆధ్వర్యంలో బెజ్జంకి హన్మంత్‌తో పాటు అమెరికా డాక్టర్ల బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చ జరిగింది. మొదటగా హన్మంత్ బెజ్జంకి డాక్టర్ల బృందాన్ని మంత్రి హరీష్ రావుకు పరిచయం చేశారు. ఏఏపీఐ అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్– అమెరికాలో వైద్య పూర్వ విద్యార్థులు, 80000 మంది భారతీయ సంతతికి చెందిన వైద్యులు ఉన్నారు. అలాగే ఉస్మానియా, గాంధీ, కాకతీయ, తెలంగాణ మెడికల్ అలుమ్ని ఆఫ్ అమెరికా తెలంగాణ, హైదరాబాద్ నుండి సుమారు 20000 మంది వైద్యులు ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వైద్య రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతున్న కేసీఆర్ మెడికల్ సీట్ల కోసం తెలంగాణా విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్ళే పని లేకుండా మెడికల్ కాలేజీల ఏర్పాటుపై దృష్టి పెట్టారని తెలిపారు. అందులో భాగంగా కొత్తగా 8 మెడికల్ కాలేజీలను నిర్మించి వైద్య విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందాల్సిన అవసరం ఉందని సీఎం సూచనలు చేశారని తెలిపారు. అందులో భాగంగా గర్భిణీ స్త్రీలు, నవజాత శిశు సంక్షేమం గురించి కేసీఆర్ కిట్,అమ్మ ఒడి పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే సీఎం కేసీఆర్ ఆలోచనతో ఏర్పాటైన బస్తీ దవాఖానాలకు విశేష స్పందన లభిస్తుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పేదలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గిస్తున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వివిధ ప్రాంతా లలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ భేటీలో డాక్టర్ హన్మంత్ బెజ్జంకి, డాక్టర్ సతీష్ కత్తుల, డాక్టర్ మెహెర్ మేడేవరం, డాక్టర్ రఘు లోలాభట్టు, డాక్టర్ సుజీత్ పున్నం, డాక్టర్ శ్రీని గంగసాని, డాక్టర్ హేమ కొర్లకుంట, డాక్టర్ జితేందర్ రెడ్డి కట్కూరి, డాక్టర్ రామారావు మేడవరం, డాక్టర్దామోదర్ నేరెళ్ల పాల్గొన్నారు, ఈ భేటీని సమన్వయ పరిచిన బీఆర్ఎస్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాలకు డాక్టర్ హన్మంతు బెజ్జంకి, డాక్టర్ల బృందం అభినందించింది.

# 382 మెగావాట్ సామర్థ్యం కలిగిన సున్నీ డ్యామ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కోసం ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 5:ఎస్ జెవిఎన్ లిమిటెడ్ ద్వారా 2614.51 కోట్ల రూపాయల అంచనా వ్యయం తో హిమాచల్ ప్రదేశ్ లో 382 మెగావాట్ సామర్థ్యాన్ని కలిగి ఉండే సున్నీ డ్యామ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గం సంఘం (సిసిఇఎ) సమావేశం తన ఆమోదాన్ని ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కు అంచనా వ్యయం. దీని లో మౌలిక సదుపాయాల ను తీర్చిదిద్దడానికి భారత ప్రభుత్వం బడ్జెటుపరంగా సహాయం రూపం లో 13.80 కోట్ల రూపాయల ను పెట్టుబడి పెట్టేందుకు కూడా స్వీకృతిని ఇవ్వడమైంది. 2022వ సంవత్సరం జనవరి వరకు మొత్తం 246 కోట్ల రూపాయల సంచిత వ్యయాని కి గాను ఎక్స్–పోస్ట్ ఫ్యాక్టో ఆమోదాన్ని సైతం ఇవ్వడం జరిగింది.

ప్రాజెక్టు వ్యయం 2614 కోట్ల రూపాయలు కాగా, అందులో 2246.40 కోట్ల రూపాయల వాస్తవిక వ్యయం, నిర్మాణం కాలం లో వడ్డీ (ఐడిసి) పద్దు రూపం లో 358.96 కోట్ల రూపాయలు మరియు ఆర్థిక సహాయ సంబంధి ఖర్చు లు (ఎఫ్ సి) మరో 9.15 కోట్ల రూపాయలు కూడా కలిసి ఉన్నాయి. రాశి సంబంధి పరివర్తన (జోడించడం/ మార్పు లు/ అదనపు వస్తువులు సహా) కారణం గా భిన్న వ్యయం లో తేడాల కై సవరించిన వ్యయ మంజూరు లు మరియు డెవలపర్ కు సూచించిన కాలావధి స్వీకృత వ్యయం లో 10 శాతాని కి పరిమితమవుతుంది.

'ఆత్మనిర్భర్ భారత్ అభియాన్' యొక్క లక్ష్యాల ను మరియు ఉద్దేశ్యాల ను దృష్టి లో పెట్టుకొని, ఎస్ జెవిఎన్ ద్వారా 382 మెగా వాట్ ల సున్నీ డ్యామ్ హెచ్ ఇపి ని ఏర్పాటు చేయడం కోసం వర్తమాన ప్రతిపాదన ద్వారా స్థానిక సరఫరాదారుల కు/స్థానిక వాణిజ్య సంస్థల కు/ఎమ్ఎస్ఎమ్ ఇ లకు వివిధ ప్రయోజనాలను అందించనుంది. దేశం లో ఉపాధి అవకాశాల ను ప్రోత్సహిస్తూ, ఆ ప్రాంతం లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి కి పూచీ పడనుంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చే క్రమం లో దీని నిర్మాణం తాలూకు చరమ దశ లో దాదాపు గా 4,000 మంది కి ప్రత్యక్ష ఉపాధి మరియు పరోక్ష ఉపాధి అవకాశాలు అందిరాగలవు.

# ఓబీసీ రిజర్వేషన్లతోనే యూపీ పురపాలక సంస్థల ఎన్నికలు

న్యూఢిల్లీ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఓబీసీ రిజర్వేషన్ల తోనే యూపీ పురపాలక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు సుప్రీంకోర్టు లో భారీ ఊరట లభించింది. ఓబీసీ రిజర్వేషన్ల ప్రసక్తి లేకుండానే యూపీ అర్బన్ బాడీ పోల్స్ నిర్వహించాలంటూ అలహాబాద్ హైకోర్టు డిసెంబర్ 27న ఇచ్చిన సంచలన తీర్పుపై సుప్రీంకోర్టు మంగళవార నాడు 'స్టే' ఇచ్చింది.అ లహాబాద్ హైకోర్టు తీర్పున డిసెంబర్ 29న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఇందుకు సంబంధించి స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) వేసింది. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ విచారణ జరుపుతూ, స్థానిక సంస్థల యంత్రాగానికి విఘాతం కలుగకుండా డెలిగేషన్, ఫైనాన్సియల్ పవర్స్ జారీ చేసే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. దీనిపై సోలిసిటర్ జనరల్ తన వాదన వినిపిస్తూ, కొత్తగా ఏర్పాటు చేసిన కమిషన్ పదవీ కాలం 6 నెలలే అయినప్పటికీ 2023 మార్చి 31కి ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ఓబీసీ రిజర్వేషన్ లేకుండానే లోకల్ బాడీ ఎన్నికలు జరపాలని అలహాబాద్ హైకోర్టు తీర్పు వెలువరించగానే యోగి ఆదిత్యనాథ్ సైతం అంతే పట్టుదలగా స్పందించారు. రిజర్వేషన్ లేకుండా ఎన్నికలకు వెళ్లేది లేదని స్పష్టం చేశారు. అంతే వేగంగా ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఐదుగురు సభ్యుల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ జస్టిస్ రామ్ అవతార్ సింగ్ సారథ్యంలో ఏర్పాటయిన ఈ కమిషన్‌లో రిటైర్డ్ ఐపీస్ అధికారులు చౌబ్ సింగ్ వర్మ, మహేంద్ర కుమార్, రాష్ట్ర మాజీ న్యాయ సలహాదారులు సంతోష్ కుమార్, బ్రిజేష్ కుమార్ సోనిలు సభ్యులుగా ఉన్నారు.

# ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో అదిరిపోయే ట్విస్ట్

## – తాజాగా సైంటిస్టు ప్రవీణ్ కుమార్ గొరకవి పేరు

న్యూ ఢిల్లీ జనవరి5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ ఢిల్లీ ప్రభుత్వాలను షేక్ చేసిన ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో అదిరిపోయే ట్విస్ట్ వచ్చేసింది. ఈ స్కాంలో ఆమ్ ఆద్మీ బీఆర్ఎస్ నేతలతోపాటు ఏపీ ఎంపీ పేరు కూడా ప్రస్తావనకు రావడంతో దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఇప్పటికే పలువురు వ్యాపారులు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. పలువురు రాజకీయ నేతల పేర్లు బయటకు వచ్చాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్ కు చెందిన మరో వ్యక్తి పేరు తెరపైకి రావడం సంచలనంఎంది. తాజాగా సైంటిస్టు ప్రవీణ్ కుమార్ గొరకవి పేరు ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బయటకు వచ్చింది. నిధుల మళ్లింపు విషయంలో ఈడీ ఈ సైంటిస్ట్ ప్రవీణ్ పేరును ఛార్జ్ షీటులో దాఖలు చేసింది. ఈడీ ఛార్జ్ షీటులో కీలక అంశాలను ప్రస్తావించింది. దుబాయ్ కంపెనీతోపాటు 'ఫ్లై' కంపెనీకి నిధుల మళ్లింపు జరిగిందని ఈడీ నిర్ధారణకు వచ్చింది.అసలు ఈ ఫ్లై కంపెనీ ఓనర్ యే ఈ సైంటిస్ట్ ప్రవీణ్ కుమార్. దీంతో ఈడీ ప్రత్యేకంగా ఈ ఢిల్లీ లిక్కర్ స్కాంలో ప్రవీణ్ పాత్రపై ఫోకస్ పెట్టింది. ప్రవీణ్ ఆర్థిక లావాదేవీలు.. ఎవరెవరు ఎంతెంత ఈ ఫ్లై కంపెనీకి నిధులు మళ్లించారు అనే విషయంపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఈ స్కాంలో నిధులు హవాలా రూపంలో ప్రవీణ్ కంపెనీకి మళ్లించారు ఈడీ. గతంలోనూ ప్రవీణ్ ఇంటిపై ఈడీ దాడులు చేసి రూ.24 లక్షలు స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో చిక్కిన సీఏ బుచ్చిబాబుకు ప్రవీణ్ సన్నిహితుడిగా ఈడీ గుర్తించింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మంత్రి అరెస్టయిన విషయం తెలిసిందే. అలాగే తెలంగాణకు చెందిన శరత్ చంద్రారెడ్డి బినోయ్ బాబు విజయ్ నాయర్ అభిషేక్ బోయినపల్లిలను కూడా ఈ స్కాంలో నిందితులుగా చేర్చారు. అయితే నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత కూడా ఈ కుంభకోణంలో భాగస్వామి అని ఆమె అత్యధికంగా లబ్ధిపొందుతారని ఎన్ ఫోర్స్ మెండ్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. కవితతో పాటు మాగుంట శ్రీనివాస్ రెడ్డి అతడి కుమారుడు రాఘవ్ రెడ్డి అరబిదో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి పేర్లను కూడా ఈడీ తన చార్జ్ షీట్ లో తెలిపిందిఇండోస్పిరిట్ సంస్థ అసలు భాగస్వాములు మాగుంట రాఘవ్ రెడ్డి కవిత అని ఈడీ తెలిపింది. ఈ సంస్థకు ఎల్ 1 కింద వచ్చిన షాపుల్లో కవితకు వాటా ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఇండోస్పిరిట్ సంస్థకు చెందిన రామచంద్ర పిళ్లై వెనుక ఉన్నది కవిత అని తెలిపింది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాగుంట రాఘవ్ రెడ్డి తుపున ప్రేమ్ రాహుల్ పనిచేస్తున్నారని రిటైల్ లో 14కోట్ల బాటిళ్లను విక్రయించడం ద్వారా రూ.195 కోట్లను సంపాదించినట్లు ఈడీ పేర్కొంది. తాజాగా సీబీఐ కూడా కవితను విచారించింది. సాక్షిగా పేర్కొని నోటీసులు జారీ చేసి విచారించింది.

# 'బ్రాడ్ కాస్టింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎండ్ నెట్ వర్క్ డెవలప్ మెంట్ (బిఐఎన్డి)' పథకానికి ఆమోదాన్ని ఇచ్చిన ఆర్థిక వ్యవహారాల సంబంధి మంత్రివర్గ సంఘం

న్యూఢిల్లీ, జనవరి 5:ప్రసార భారతి.. అదే ఆకాశవాణి (ఎఐఆర్) మరియు దూర్ దర్శన్ (డిడి) ల యొక్క మౌలిక సదుపాయాల అభివృద్ధి పరచడం కోసం 2,539.61 కోట్ల రూపాయల వ్యయం తో "బ్రాడ్ కాస్టింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎండ్ నెట్ వర్క్ డెవలప్ మెంట్" (బిఐఎన్ డి) పేరు తో ఒక కేంద్రీయ రంగ పథకాన్ని అమలు చేయాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తీసుకువచ్చిన ప్రతిపాదన కు ఆర్థిక వ్యవహారాల పై ఏర్పాటైన మంత్రివర్గ సంఘం (సిసిఇఎ) తన ఆమోదాన్ని తెలిపింది. ఈ ద బ్రాడ్ కాస్టింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఎండ్ నెట్ వర్క్ డెవలప్ మెంట్" (బిఐఎన్ డి) పథకం అనేది ప్రసార భారతి సంస్థ కు సంబంధించిన ప్రసార సంబంధి మౌలిక సదుపాయాలు, కంటెంట్ డెవలప్ మెంట్ మరియు సివిల్ వర్కు ల తాలూకు ప్రసార ఖర్చు లు, ఉన్నతీకరణ తో ముడిపడ్డ వ్యయం కోసమని ప్రసార భారతి కి ఆర్థిక సహాయాన్ని అందించడాని కి ఉద్దేశించి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించినటువంటి పథకం గా ఉంది.

దేశం లో సార్వజనిక ప్రసార సంస్థ హోదా లో కార్యకలాపాల ను నిర్వర్తిస్తున్నటువంటి ప్రసార భారతి అనేది అత్యంత ప్రాముఖ్యం కలిగినటువంటి సమాచార ప్రదాన, విద్య బోధక, వినోద ప్రధాన సాధనం గా ఉంది అని చెప్పాలి. ఈ సంస్థ దూర్ దర్శన్ మరియు ఆకాశవాణి ల ద్వారా దేశం లోని మారుమూల ప్రాంతాల ప్రజల లో తన వంతు కృషి ని సాగిస్తోంది. కోవిడ్ మహమ్మారి చెలరేగిన కాలం లో ప్రజల కు సార్వజనిక ఆరోగ్య సందేశాల ను చేరవేస్తూ, వారిని చైతన్యవంతుల ను చేయడం లో ప్రసార భారతి ఒక మహత్వపూర్ణమైన పాత్ర ను పోషించింది.

బిఐఎన్ డి పథకం అనేది ఈ సార్వజనిక ప్రసార సంస్థ లో మెరుగైన మౌలిక సదుపాయాల ను మరిన్నిటిని సమకూర్చుకోవడానికి తోడ్పడనుంది. దీనితో ప్రసార భారతి యొక్క వ్యాప్తి అనేది సరిహద్దు ప్రాంతాలు, వ్యూహాత్మక ప్రాంతాలు మరియు వామపక్ష తీవ్రవాదం ప్రబలం గా ఉన్న ప్రాంతాల లో తన కార్యక్రమాల ను ప్రసారం చేసేందుకు, అలాగే ప్రేక్షకుల కు అధిక నాణ్యత కలిగిన కార్యక్రమాల ను అందించడానికి దోహద పడుతుంది. దేశీ శ్రోతల కు, విదేశీ శ్రోతల కు మంచి నాణ్యత కలిగిన కార్యక్రమాల ను అందించడానికి డిటిహెచ్ ప్లాట్ ఫార్మ్ యొక్క సామర్థ్యాన్ని పెంపొందింప చేయడం ద్వారా మరిన్ని చానల్స్ ను ఇవ్వడానికి వీలు కలుగుతుంది. ఈ ప్రాజెక్టు లో భాగం గా దూర్ దర్శన్ మరియు ఎఐఆర్ స్టూడియోల ను డిజిటల్ విధానం లో ఉన్నతీకరించడానికి, అలాగే ఒబి వ్యాన్ లను కొనుగోలు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. దీని ద్వారా ఈ రెండు మాధ్యాలు హెచ్ డి రెడీ హంగు ను సంతరించుకొంటాయి.

వర్తమానం లో, దూర్ దర్శన్ 28 ప్రాంతీయ చానల్స్ తో సహా 36 టీవీ చానల్స్ ను నడుపుతున్నది. ఇక ఆల్ ఇండియా రేడియో 500 కు పైగా ప్రసార కేంద్రాల ను నిర్వహిస్తున్నది. ఈ ప్రతిపాదిత పథకం దేశం లో ఎఐఆర్ యొక్క ఎఫ్ఎమ్ ట్రాన్స్ మిటర్స్ కవరేజి ని భౌగోళికం గా చూసినప్పుడు 59 శాతం నుండి పెరిగి 66 శాతం మేరకు విస్తరించగలదు. అదే జనాభా పరం గా పరిశీలించినప్పుడు, దీని విస్తృతి 68 శాతం నుండి 59 శాతం నుండి పెరిగి 80 శాతాని కి చేరుకొంటుంది. ఈ పథకం లో 8 లక్షల కు పైగా డిడి ఫ్రీ డిశ్ సెట్ టాప్ బాక్సుల ను మారుమూల ప్రాంతాలు, ఆదివాసి ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాదం ప్రబలం గా ఉన్న ప్రాంతాలు మరియు సరిహద్దు ప్రాంతాల లో నివాసం ఉంటున్న ప్రజల కు ఇవ్వాలని సంకల్పించడమైంది. సార్వజనిక ప్రసారాల పరిధి ని పెంచడం తో పాటు గా, ప్రసార సంబంధి మౌలిక సదుపాయాల ఆధునికీకరణ మరియు వృద్ధి తాలూకు ప్రాజెక్టుల కు ప్రసార ఉపకరణాల సరఫరా, ఇంకా స్థాపన తో ముడిపడిన తయారీ మరియు సేవల మాధ్యం ద్వారా పరోక్ష ఉపాధి ని కల్పించే సత్తా సైతం ఉంది. ఆకాశవాణి మరియు దూర్ దర్శన్ లకు సరిక్రొత్త కంటెంటు ను సిద్ధం చేయడం అనేది వివిధ ప్రసార మాధ్యాల లో అనుభవశీలురైన వ్యక్తుల కు పరోక్షం గా ఉపాధి ని కల్పించగలదు. ఈ అవకాశాలు టివి/రేడియో మాధ్యాల నిర్మాణం, ప్రసారాలతో పాటు ప్రసార మాధ్యమాల కు సంబంధించిన సేవల తో ముడిపడి ఉంటాయి. పైపెచ్చు డిడి ఫ్రీ డిశ్ పరిధి ని విస్తరింప జేయనున్నందువల్ల డిడి ఫ్రీ డిశ్ డిటిహెచ్ బాక్సు ల తయారీ రంగం లో ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడుతాయన్న అంచనాలు ఉన్నాయి.

భారత ప్రభుత్వం దూర్ దర్శన్ మరియు ఆకాశవాణి (ప్రసార భారతి) ల సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన, సేవల వికాసం, ఆధునికీకరణ మరియు పటిష్టీకరణ ల పట్ల తన నిబద్ధత ను పునరుద్ఘాటిస్తూ, ఈ మూడు ప్రక్రియ లు కూడాను నిరంతరం గా కొనసాగేవే అని సూచిస్తున్నది.

# మంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి....!-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి,జనవరి 05 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో ఈ నెల 6న మంత్రి హరీష్ రావు పాల్గొననున్న కార్యక్రమాలన్నీ సక్రమంగా జరిగేలా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆయా అధికారులకు ఆదేశించారు.

రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి జనవరి 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి పర్యటన షెడ్యూల్ మేరకు ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల ఇంచార్జ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమాలన్నీ సాఫీగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఆయా కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి లు కలెక్టర్ కు వివరించారు.

ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు,డి.పి. ఓ.సురేష్ మోహన్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.గాయత్రీ దేవి,వ్యవసాయ శాఖ జేడి నరసింహారావు, రెవిన్యూ డివిజనల్ అధికారులు నగేష్, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



# టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశ వ్యాప్తంగా కేసీఆర్ అవినీతిని ఎండగడుతామని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం తెలిపారు. బుధవారం మీడియాతో మాటాడుతూ... రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో పోటీచేస్తామని స్పష్టం చేశారు. నీళ్ళు, నిధులు, నియామకాల ఆకాంక్ష ఇంకా నెరవేరలేదన్నారు. తన అస్తిత్వం తప్పితే.. తెలంగాణ అస్తిత్వాన్ని కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఆందోళనలు చేస్తే అరెస్టులు చేసి.. ఢిల్లీకి వెళ్లి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. జనవరి 30న ఢిల్లీలో సెమినార్, 31న విభజన హామీలపై ఆందోళన చేస్తామని ఆయన చెప్పారు. 31న విభజన హామీలు, చట్టం అమలుపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ ఇస్తామన్నారు. కృష్ణా జలాల సాధన కోసం ఈనెల 10న నిరసన దీక్ష చేస్తామని, జనవరి 20న ధరణి సమస్యలపై సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులను సైతం సర్కారు కొల్లగొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా బలోపేతం అవుతాం.. తెలంగాణను కాపాడుకుంటామన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వాదులమంతా ఐక్యమై తెలంగాణ వాదాన్ని రక్షించుకోవాలని నిర్ణయించామన్నారు. త్యాగాల పునాదిపైన ఏర్పడిన పార్టీ తెలంగాణ పేరును తొలగించిందని విమర్శించారు. ఉద్యమ అమరులను, తెలంగాణ వాదాన్ని అవహేళన చేసిందని కోందడరాం వ్యాఖ్యలు చేశారు.

# శ్వాసకోశ ఇన్ఫెక్షన్ తో ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

న్యూ ఢిల్లీ జనవరి 5(ఎక్స్ ప్రెస్ న్యూస్ );కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ శ్వాసకోశ ఇన్ఫెక్షన్ కారణంగా ఆస్పత్రిలో చేరారు. ఆమెను న్యూఢిల్లీలోని గంగారామ్ ఆసుపత్రికి తరలించారు. యూపీఏ అధ్యక్షురాలిని చెస్ట్ మెడిసిన్ విభాగంలో చేర్చారు. డాక్టర్ అరూప్ బసు అండ్ టీమ్ సోనియా గాంధీకి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చేర్చిన సమయంలో సోనియాతో పాటు ఆమె కుమార్తె ప్రియాంక వాద్రా ఉన్నారు. సోనియా వైరల్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ కోసం పరిశీలనలో ఉంచబడింది.సోనియాకు పరీక్షలు చేస్తారు. సర్ గంగారామ్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు "యూపీఏ చైర్పర్సన్ సోనియా గాంధీ ఈరోజు మా ఆసుపత్రిలో చేరారు. ఆమె డాక్టర్ అరూప్ బసు మరియు అతని బృందం సంరక్షణలో చెస్ట్ మెడిసిన్ విభాగంలో చేరింది. వైరల్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ని సంబంధించిన పరిశీలన.. చికిత్స కోసం సోనియాగాంధీ చేరారు.' అని తెలిపారు. ఇటీవల సోనియా గాంధీ.. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా భర్త రాబర్ట్ వాద్రాతో కలిసి ఢిల్లీలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆమె ఈ అనారోగ్యం బారినపడ్డట్టు సమాచారం. అంతమందిలో నడవడంతో ఆమెకు వైరల్ ఇన్ఫెక్షన్ సోకి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సోనియా ఆరోగ్యంపై పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె త్వరగా కోలుకోవాలని కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య విచారం వ్యక్తం చేశారు.

# ఉద్యోగులకు కనీస ప్రయోజన హామీకి సిఫారసు చేస్తూ కోల్ ఇండియా లిమిటెడ్-ఉద్యోగ సంఘాల మధ్య అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 5: కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)లో వేతన చర్చలలో ప్రతిష్టంభనకు స్వస్తి పలుకుతూ నాలుగు కేంద్ర కార్మిక సంఘాలు– బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూలతో 'సీఐఎల్' అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ మేరకు 19 శాతం కనీస ప్రయోజన హామీ (ఎంజీబీ)కి సిఫారసు చేసే ఈ ఒప్పందంపై 2023 జనవరి 3న సంతకాలు పూర్తయ్యాయి. తద్వారా ప్రస్తుత జాతీయ బొగ్గు వేతన ఒప్పందం–చీఏ (ఎన్‌సీడబ్ల్యూఏ–చీఏ) భాగంగా 2.38 లక్షల మంది నాన్–ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు తాజా ఒప్పందంతో ప్రయోజనం చేకూరుతుంది. కాగా, ఈ 19 శాతం 'ఎంజీబీ'లో 2021 జూన్ 30 నాటికి మూల వేతనం, వేరియబుల్ డి.ఎ., స్పెషల్ డి.ఎ., అటెండెన్స్ బోనస్ అంతర్భాగంగా ఉన్నాయి. సంబంధిత ఒప్పందంపై సంతకం చేసిన భాగస్వాములలో తెలంగాణలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కూడా ఒకటిగా ఉంది. ప్రభుత్వాల ఆధ్వర్యంలోగల 'సీఐఎల్, ఎస్‌సీసీఎల్' బొగ్గు సంస్థల సిబ్బంది సంఖ్య 2021 జూలై 1 నాటికి మొత్తం 2.82 లక్షలు కాగా, వీరిలో ఎస్‌సీసీఎల్ ఉద్యోగులు దాదాపు 44,000 మందిదాకా ఉన్నారు.

జనవరి 3న కోల్‌కతాలోని సీఐఎల్ కార్పొరేట్ ప్రధాన కార్యాలయంలో బొగ్గు పరిశ్రమ–చీఏకు సంబంధించిన ద్వైపాక్షిక సంయుక్త కమిటీ ఎనిమిదో సమావేశంలో ఈ సిఫారసుపై అంగీకారం కుదిరింది. ఎంజీబీ కాకుండా ఇతరత్రా అంశాలపైనా చర్చలు కొలిక్కి వచ్చిన తర్వాత ఐదేళ్ల కాలానికిగాను 2021 జూలై 1 నుంచి అమలులోకి వచ్చేవిధంగా ఎన్‌సీడబ్ల్యూఏ–చీఏ సంబంధిత ఒప్పందం ఖరారు చేస్తారు. 'ఎంజీబీ'పై స్నేహపూర్వక అంగీకారానికి రావడంలో నాలుగు కేంద్ర కార్మిక సంఘాలు చొరవ చూపాయి. మరోవైపు 'సీఐఎల్' కూడా సామరస్యపూర్వక పారిశ్రామిక సంబంధాలు కలిగి ఉంది. దీంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్య సాధన ప్రాముఖ్యాన్ని కార్మిక సంఘాలు కూడా గుర్తించడంతో చర్చలు ఫలించాయి.

# ఈ నెల 13లోగా అన్ని హంగులతో మోడల్ స్కూల్స్ సిద్ధం కావాలి.....!-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ .



సంగారెడ్డి,జనవరి 05 (నేటి నిజం ప్రతినిధి) మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని హంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు.

గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా తో కలిసి మన ఊరు మనబడి పనుల పురోగతి, ఎఫ్.టి. ఓ.ల జనరేట్, మోడల్ స్కూల్స్ పనుల పురోగతి, తదితర అంశాలపై విద్య, ఇంజనీర్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఇప్పటికే పూర్తయిన సివిల్ వర్క్స్ తో పాటు పెయింటింగ్, సంప్, టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, ఫ్లోరింగ్ , ఫినిషింగ్ ,తదితర పనులు సొంత ఇంటి పని తరహాలోనే పాఠశాలల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన ఉండేలా చొరవ చూపాలని సంబంధిత ఎం. ఈ. ఓ.లకు సూచించారు. మన ఊరు మనబడి లో చేపట్టిన మోడల్ స్కూల్స్ ను ఈ నెల 13 లోగా అన్ని హంగులతో పూర్తి చేయాలని సూచించారు.

ఇప్పటికే పనుల్లో జాప్యం జరిగిందని, పనులను నాణ్యతతో చేపడుతూ సత్వరమే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పనులలో జాప్యంపై పలు నియోజకవర్గాల ఈఈ లు, డి ఈ ల పని తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. వచ్చేవారం వరకు చూస్తానని, అప్పటికి పురోగతి లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తయిన పనులకు వెంట వెంటనే ఎఫ్ టి ఓ (ఫండు ట్రాన్స్ఫర్ ఆర్డర్స్) లను అప్లోడ్ చేయాలని సూచించారు. పాఠశాల పెయింటింగ్ అంశంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం సూచించిన కలర్ కోడ్ రంగులు వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేష్, ఇంజనీరింగ్ శాఖల ఈ ఈ లు, డి. ఈ.లు,ఎం ఈ ఓ లు, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం కై పాటుపడాలి

## –మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు

హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని తెలుగు రాష్ట్రాలు భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని నూతన సంవత్సర సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గురువారం జూబ్లీహిల్స్ లోని నాదెండ్ల భాస్కరరావు గారి స్వగృహం సర్వధర్మ నిలియంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ బృందం ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా నాదెండ్ల భాస్కర్ రావు గారు ప్రజలకు నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం కై పాటుపడాలని సూచించారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కేబి శ్రీధర్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ వాసుదేవరావు ఉపాధ్యక్షుడు దశరథం మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి నసీర్ భాష గ్రేటర్ హైదరాబాద్ యువజన విభాగం అధ్యక్షుడు నవీన్ ప్రోటోకాల్ ఇంచార్జ్ ఎం వి ఎస్ చౌదరి కార్యవర్గ సభ్యులు చిత్ర అరుణ రెడ్డి వాణి రాజు సంఘ సేవకురాలు విజయదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 6న మంత్రి హరీష్ రావు పర్యటన.....! జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, జనవరి 05 (నేటి నిజం ప్రతినిధి) ఈనెల 6న రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీష్ రావు జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం నాడు ప్రకటనలో తెలిపారు. జనవరి 6న (శుక్రవారం) ఉదయం 10:00 గంటలకు పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో జీవో 58 క్రింద లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తారని తెలిపారు. ఉ.11:00 గంటలకు సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరవుతారని, మ.12:30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో కంటి వెలుగు కార్యక్రమం పై నిర్వహించు జిల్లా స్థాయి అవగాహన సదస్సులో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. మ.3:00 గంటలకు మొగుడంపల్లి మండలం ఉప్పర్ పల్లి తండాలో మోతిమాత ఆలయాన్ని మంత్రి సందర్శిస్తారని తెలిపారు. సా.4:30 గంటలకు ఝరాసంగం మండలం బిడేకన్నె గ్రామ శివారులోని అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థలో పర్మా కల్చర్ చేస్తున్న రైతులను కలిసి మంత్రి మాట్లాడుతారని ఆ ప్రకటనలో తెలిపారు. అనంతరం మంత్రి హైదరాబాదు వెళ్తారని తెలిపారు.

# జర్నలిస్టుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి...



మహబూబాబాద్, జనవరి 5:(నేటినిజం ప్రతినిధి): జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఏర్పడిన టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్), యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మీడియా అకాడమీ చైర్మన్,అల్లం నారాయణ సారధ్యంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్నారని టీయూడబ్ల్యూజే (టిజెఎఫ్)మహబూబాబాద్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు జలగం శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రెండవ రాష్ట్ర మహాసభ పోస్టర్ ను స్థానిక ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, ఎస్సై రియాజ్ పాషాలతో కలిసి ఆవిష్కరణ చేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 8, 9,10 వ తేదీన హైదరాబాద్ లోని పఠాన్ చెరువులోజరిగే జర్నలిస్టుల రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. వివిధ కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయంచేసి అండగా నిలిచిన ఘనత తమ సంఘందే అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతకోసం నిరంతరం పాటుపడే టీయుడబ్ల్యూజేను ఆదరించాలని జర్నలిస్టులకు పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కృష్ణ రెడ్డి, పెద్దవంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సదానందం, గౌరవ అధ్యక్షులు బోగోజు భద్రయ్య చారి, ప్రధాన కార్యదర్శి బాలాజీ నాయక్, సభ్యులు వేణు, భాస్కర్, మధు, రాజు, యాకన్న, విక్రమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ముగ్గుల పోటీలు



కరీంనగర్, జనవరి 5: (నేటినిజం ప్రతినిధి): ముగ్గుల ద్వారా ఆనందం కలుగుతుంది. అది శుభాలకు ప్రతీక అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. డాక్టర్ వనజ రెడ్డి, డాక్టర్ చైతన్యరెడ్డి తో కలసి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మాతృమూర్తులకు నిర్వహింపబడిన అల్ఫోర్స్ పొంగల్ రంగోళి పోటీలకు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ప్రాంగణంలో ఏర్పాటుచేసినటువంటి శ్రీ పార్వతిదేవి చిత్రపటానికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగ్గులు సాంప్రదాయలకు ప్రతీక. ఏ రకమైన ఇంటికైన అందాన్ని తెస్తాయి. తద్వారా గృహాలు చాలా ఆచారంగా కన్పిస్తాయని అన్నారు.

ముగ్గుల ద్వారా సంక్రాంతి పండుగ సాంప్రదాయాల పరిరక్షణ సందేశాన్ని అందజేయవచ్చని పేర్కొన్నారు. పండుగల గొప్పతనాన్ని వ్యాపింపచేసిన వారమవుతామని, సంక్రాంతి పండుగ పల్లెల్లో చాలా రకారకాల ముగ్గులతో చక్కగా జరుపుకుంటారని ప్రకృతి పులకరించే విధంగా ముగ్గులు వేస్తారని వివరించారు. పాఠశాలలో నిర్వహింపబడిన పోటీలకు సుమారు 350 మంది విద్యార్థుల మాతృమూర్తులు పాల్గొన్నారు పండుగ విశిష్టతను తెలిపే వివిధ ఆకర్షణీయమైన ముగ్గులను వేసారు. అందంగా వేసిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. పోటీలలో పాల్గొన్న వారందరికి ప్రోత్సాహక పత్రాలను అందజేసి అభినందించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి ఎడ్ల బండితో పోదాం.. మన పల్లెకు చేరుకుందాం. మన చకినాల పండుగ సంక్రాంతి. నృత్యప్రదర్శనలు చాలా ఆకర్షించాయి. పాఠశాలను పల్లెటూరు వాతవరణం ఉట్టిపడేలా అందంగా అలకరించారు.

ఈ పోటీలకు విచ్చేసిన వారందరు నరేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆచార సాంప్రదాయలను సజీవంగా నిలుపుతున్న విఎన్ఆర్ ను అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

# పెండింగ్ ఉన్న 95 వేల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ ను ఈ నెలాఖరులోగా పంపాలి

మెదక్, జనవరి 5: నేటినిజం ప్రతినిధి): 2021-22 ఖరీఫ్ కు సంబంధించి పెండింగ్ ఉన్న 95 వేల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ ను ఈ నెలాఖరులోగా మిల్లింగ్ చేసి పంపవలసినదిగా అదనపు కలెక్టర్ రమేష్ రైస్ మిల్లుల యాజమాన్యాన్ని కోరారు. గురువారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో రా రైస్, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ఖరీఫ్ కు సంబంధించి ఇంకను 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సనత్ నగర్ లోని ఎఫ్.సి.ఐ. గోదాముకు, 63 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పౌర సరఫరాల శాఖకు మిల్లింగ్ చేసి పంపవలసి ఉందని అన్నారు. ఈ మాసం చివరి వరకు పెండింగ్ ఉన్న సీఎంఆర్ రైస్ ను పంపాలని, ఎట్టి పరిస్థితులలో గడవు పెంచమని భారత ఆహార సంస్థ స్పష్టం చేసిందని అన్నారు. కాబట్టి సీఎంఆర్ పెండింగ్ ఉన్న 120 రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లు డిఫాల్ట్ లేకుండా ఈ 20 రోజులు కష్టపడి ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పంపవలసినదిగా కోరారు. ఇక నుండి ఎఫ్.సి.ఐ. పోర్టిఫైడ్ రైస్ ను మతమే కొనుగోలు చేస్తుందని, ఆ మేరకు రైస్ మిల్లులను ఆధునీకరించు కోవలసినదిగా సూచించారు. కాగా ఈ ఖరీఫ్ సీజన్ లో 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 45 రోజులలోగా 91,379 మంది రైతుల నుండి 3,93,578 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వంద శాతం ట్యాప్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాలో 850 కోట్లు జమచేసి రాష్ట్రంలో ముందున్నామని ఇందుకు సహకరించిన రైస్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఒప్పంద పత్రాలు ఇవ్వని వారు వెంటనే అందజేయాలని కోరారు. ఎఫ్.సి.ఐ. సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి తెస్తే కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. పౌర సరఫరాల సంస్థ సిబ్బంది కూడా క్షేత్ర స్థాయిలో రైస్ మిల్లులను సందర్శించి ఏమైనా సమస్యలుంటే పరిష్కరించాలని సూచించారు. జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు చంద్ర పాల్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు వేలాది కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేసి వాటిని కాపాడి ప్రభుత్వానికి ఇస్తున్న గౌరవం లేదని ఎఫ్.సి.ఐ. వారు రైస్ మిల్లర్లంటే లోకువగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సనత్ నగర్ లోని ఎఫ్.సి. ఐ. లో జరిగిన సంఘటనే ఉదాహరణ అని, పౌర సరఫరా అధికారులు జిల్లా మేనేజర్ తో మాట్లాడినతరువాతే సమస్య పరిష్కారమయ్యిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, మెదక్ నియోజక వర్గం అధ్యక్షులు సంతోష్ రెడ్డి, నరసాపూర్ నియోజక వర్గం అధ్యక్షులు యాదవ రావు, కార్యదర్శి నగేష్, రా, బాయిల్డ్ రైస్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమైన రంగంగా ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగం



హైదరాబాద్ జనవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుగారి విజన్ మేరకు ప్రభుత్వం సాగునీరు, విద్యుత్, వ్యవసాయ రంగం పై ప్రత్యేక శ్రద్ద వహించడంలో తెలంగాణ రాష్ట్రం ధాన్యాగారంగా ప్రసిద్దికెక్కి ధాన్యం ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి సాధించి వ్యవసాయ తెలంగాణ గా అవతరించింది . వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, పౌల్ట్రీ, లైవ్ స్టాక్ లలో ఉత్పత్తి పెరగడంతో ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ముఖ్యమైన రంగంగా గుర్తించింది. ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు అవసరమైన అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించడంతో దేశీయ , అంతర్జాతీయ పెట్టుబడులు పెరిగాయి . స్థానికంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధర కల్పించడం, వాటిని ఆన్ డిమాండ్ గా అమ్ముకోవడం, మిగిలిన పంటను ఆహార కేంద్రాల్లో ప్రాసెసింగ్ చేస్తారు. దీంతో మహిళాసంఘాలకు ఉపాధి అవకాశాలు పెంపొందించడం, రేషన్ డీలర్లకు అదనపు ఆదాయం కల్పించడం, ప్రజలకు కల్తీలేని ఆహార ఉత్పత్తులను అందించడం, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతున్నది. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం ఏర్పడింది. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ డేటా ప్రకారం రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థిర మూలధనం రూ. 4436 కోట్లు. 2021 నాటికి ఇది 53% పెరిగి రూ.6812 కోట్లకు చేరుకున్నది. 2022-23లో స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ( ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్) కు అదనంగా 2022-23 లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లలో మరో 2396 కోట్ల పెట్టుబడుల ప్రక్రియ పురోగతిలో ఉంది. రూ. 2500 కోట్లకు పైగా పెట్టుబడులతో పలు మెగా ప్రాజెక్టులు అండర్ ఇంప్లిమెంటేషన్ లో ఉన్నాయి. దీనితో ఈ రంగంలో స్థిర మూలధనం రూ. 10 వేల కోట్లను దాటే అవకాశం ఉంది. రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న స్థిర మూలధనం రెట్టింపుకు చేరుకున్నాయి. యూ ఎ ఖయూ డాటా ప్రకారం ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్ లో 2017 నుండి 2021 వరకు 2140 యూనిట్ల ద్వారా 2376 కోట్ల పెట్టుబడి పెట్టడం వలన 29841 మందికి ఉద్యోగాలు లభించాయి. ఆయిల్ మిల్స్, రైస్ మిల్స్ , డైరీ యూనిట్స్ , స్పైస్ ప్రాసెసింగ్ యూనిట్లలో పెట్టుబడులు చేశారు.యువతకు ఉపాది అవకాశాలు కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు విలువలను జోడించి రైతులను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యంగా 2021 లో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటును ప్రారంభించడంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 7150 ఎకరాలలో 21 స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ లను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసింది.నవంబర్ 2022 నాటికి రూ.2396 కోట్ల పెట్టుబడికి సంబంధించి 1496 దరఖాస్తులు రాగా 3038 ఎకరాలకు సంబంధించి 1031 అలాట్మెంట్ ఆర్డర్ లను జారీ చేయడమైనది. రైస్ మిల్స్, ఎథనాల్ అథారిటీ పరిశ్రమలు, డైరీ , ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్ లలో ఎక్కువగా పెట్టుబడులు నమోదయ్యాయి. మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంట్రప్రెన్యూర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకంగా రూ. 10 లక్షల వరకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రభుత్వం తోడ్పాటునిస్తున్నది. నవంబర్ 2022 నాటికి 834 మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, కోలాటెరల్ ఫ్రీ లోన్ , క్యాపిటల్ గ్రాంట్ మంజూరయ్యాయి. ఈ యూనిట్లు ప్రారంభానికి సిద్దంగా ఉన్నాయి. వీటితో పాటు మరో 3132 దరఖాస్తుల అనుమతుల మంజూరు ప్రాసెస్ లో ఉన్నాయి.

# వేములవాడలో రేపు 100 కోట్ల కుంభకోణాన్ని బయటపెడుతున్నాం -ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జనవరి 5: (నేటినిజం ప్రతినిధి): స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు 100 కోట్ల కుంభకోణాన్ని బయటపెడతానని వ్యాఖ్యలు చేసి జర్మని వెళ్ళాడు.. కుంభకోణంపై వ్యాఖ్యలు చేసి నెలలు గడుస్తున్న బయట పెట్టకపోవడం సిగ్గుచేటుప్రతి పక్ష పార్టీ నాయకులుగా ప్రజా సమస్యలపై అంకితభావంతో అన్ని ఆధారాలతో నేడు శుక్రవారం ప్రజల సమక్షంలో 100 కోట్ల కుంభకోణాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోబయట పెడుతున్నాం వేములవాడ అర్బన్, రూరల్ టౌన్, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆది శ్రీనివాస్ హాట్ టాపిక్ కామెంట్స్ చేశారుప్రస్తుతం వేములవాడలో అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీ నాయకుల్లో ఉత్కంఠ రేపుతున్న ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, మండల అర్బన్, రూరల్ అధ్యక్షులు పిల్లి కనకయ్య ఒకలభరణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు


**IN THE COURT OF HON'BLE III rd ADDI CHIEF JUDGE CUM MACT CITY CIVIL COURT AT:HYDERABAD**

**O.P.NO.61 OF 2018**

BETWEEN:

V.Narsimha Ramulu ...Petitioner

**AND**

**J.Ramna Reddy** ….Respondent

To,

J.Ramna Reddy,S/o.J. Yadi Reddy, Occ: Own er of Vehicle No.AP 11 V 1044,R/o.H.No.12-2-37/ 1/A/15, Murad nag ar, Zeba Bagh, Hydera bad, BASARA SAMY UKTHA and Others. **...R1**

B.Srinaiah,S/o.B. Maisa iah,Occ:Driver of Vehi cle No.AP 11 V 1044,R/ o.Plot No.14,Press Col ony, South End Park, Mansoorabad, L.B. Nagar **...R2**

Please take Notice that the above named Petitio ner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 23-1-2023.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)

**Sri.Ravi Krishna Kumar,**
Advocate
Saidabad ,
Hyderabad.


# కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయండి

## సాదిక్ సఫియా గోల్డెన్ ఫౌండేషన్ అధ్యక్షులు సయ్యద్ రసూల్



రాజన్న సిరిసిల్ల, జనవరి 5:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ పట్టణంతో పాటు వేములవాడ. సిరిసిల్ల. జగిత్యాల పట్టణాలలోట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయలని సాధిక్ సఫియా గోల్డెన్ ఫౌండేషన్ అధ్యక్షులు సయ్యద్ రసూల్ అధికారులకు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ముందు చూపుతో కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. పట్టణాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా ఉంటుందని వెంటనే పై అధికారులు కరీంనగర్ పట్టణం రోజురోజుకు ట్రాఫిక్ ఇబ్బందితో సిగ్నల్స్ లేక వాహనాలకు ఇబ్బంది అవుతుందని వెంటనే కరీంనగర్ పట్టణంలోని గీత భవన్ చౌరస్తా. కలెక్టరేట్ చౌరస్తా. ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తా. బైపాస్ రోడ్డు. కోర్ట్ చౌరస్తా. మంచిరియల్ చౌరస్తా. గాంధీ చౌరస్తా. నాకా చౌరస్తా తోపాటు వివిధ కుడిలలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే వాహనదారులు అందరికీ ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే వేములవాడ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్న సందర్భంగా ప్రధాన బ్రిడ్జి దగ్గర ఇరువైపులా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని అలాగే అంబేద్కర్ చౌరస్తా వద్ద. వ్యవసాయ మార్కెట్ చౌరస్తా వద్ద. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సయ్యద్ రసూల్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే సిరిసిల్ల పట్టణంలో కలెక్టరేట్ చౌరస్తా. పాత ఆర్టిసి బస్టాండ్ చౌరస్తా వద్ద. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని కోరారు. జగిత్యాల లో నూతనంగా ఇప్పటికైనా జిల్లాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు తోపాటు పాదచారులకు ప్రమాదాలు జరగకుండా ఉంటుందని తెలిపారు. వెంటనే ఉన్నత అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సాధిక్ సఫియా గోల్డెన్ ఫౌండేషన్ అధ్యక్షులు సయ్యద్ రసూల్ ఉన్నత అధికారులకు ఈమెయిల్. ఫ్యాక్స్ ద్వారా కోరారు

# ఇద్దరు ఎస్‌వోటీ కానిస్టేబుల్స్ పై దాడి..

హైదరాబాద్, జనవరి 5:ఇద్దరు ఎస్‌వోటీ కానిస్టేబుల్స్ పై దాడి జరిగిన ఘటన హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో చోటుచేసుకుంది. సిక్కుల బస్తీలో ఓ దుండగుడు రెచ్చిపోయాడు. ఇద్దరు ఎస్‌వోటీ కానిస్టేబుళ్ల పై తల్వార్‌తో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. ఓ కేసు దర్యాప్తు కోసం వెళ్లిన కానిస్టేబుళ్ల పై విరుచుకుపడ్డాడు. ఈ ఘటనలో రాజు అనే కానిస్టేబుల్ ఛాతిలో పొడవగా.. తీవ్రగాయాల పాలయ్యాడు. అతన్ని పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. మరో కానిస్టేబుల్ వినయ్ తలకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# హలో జర్నలిస్ట్.. చలో హైదరాబాద్

## - రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి పువ్వాడ

## - టీయుడబ్ల్యూజే(టీజేఏఫ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



ఖమ్మం, జనవరి 5: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) రాష్ట్ర ద్వితీయ మహాసభల వాల్ పోస్టర్లను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు.

ఈ నెల 8న టీయూడబ్ల్యూజే (టీజేఏఫ్) ద్వితీయ రాష్ట్ర మహాసభలు అదేవిధంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పదవ ప్లీనరీ హైదరాబాద్ లోని పటాన్ చెరువు జిఎంఆర్ కన్వెన్షన్ లో జరగనున్నాయి. రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. మన రాష్ట్రం.. మన యూనియన్ పేరుతో జరుగుతున్న రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ.. జనవరి 8న హైదరాబాదులోని పటాన్ చెరువు జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో ప్రారంభం కానున్న రాష్ట్ర మహాసభలకు జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇదే మహాసభలో మరో రెండు రోజులు జనవరి 9, 10న రాష్ట్ర నాయకత్వానికి సంబంధించిన ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు)10వ ప్లీనరీ జరగనుందని తెలిపారు. 8న జరిగే రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు భారీగా హైదరాబాద్ కు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఖమ్మంతో పాటు ఆయా డివిజన్లలో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని, హైదరాబాద్ కు వచ్చే జర్నలిస్టులు తమ పేర్లను డివిజన్ల వారీగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రారవి, ఉపాధ్యక్షులు వెన్నబోయిన సాంబశివరావు, టీఎస్ చక్రవర్తి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వి.రామకృష్ణ, శెట్టి రజినీకాంత్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి కొరకొప్పుల రాంబాబు, నగర కమిటీ ప్రధానకార్యదర్శి అమరవరపు కోటేశ్వరావు, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షకార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, కోశాధికారి శ్రీధర్, జిల్లా నాయకులు విన్నెల్లి శ్రీనివాస్, కె.వి, షేక్ జానీపాషా, బిక్కీ గోపి, సాయి, మందుల ఉపేందర్, కెమెరామెన్లు నాగరాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలి



మెదక్, జనవరి 5: నేటినిజం ప్రతినిధి):రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. గురువారం తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తూ వారికి పెన్ డ్రైవ్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నవంబర్ 9 న ఓటర్ల ముసాయిదా ప్రకటించే నాటికి జిల్లాలో 4,06,629 మంది ఓటర్లు ఉండగా నేడు తుది జాబితా ప్రకటించే నాటికి 4,09,473 మంది ఓటర్లుగా ఉన్నారని అన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టడంతో, పాఠశాల, కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్ల ద్వారా, లిటరసీ క్లబ్ ల ద్వారా విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు బ్లాక్ స్థాయిలో ఇంటింటికి తిరిగి 18 ఏళ్ళు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయడం, స్వీప్ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడం వంటి కారణాల వల్ల కొత్తగా 9,860 ఓటరులుగా నమోదయ్యారని అన్నారు. మెదక్ నియోజక వర్గంలో 2,02,636 మంది ఓటరు ఉండగా ఇందులో 1,05,077 మంది మహిళా ఓటర్లు, 97,556 మంది పురుష ఓటర్లు, ఇతరులు ముగ్గురు ఉన్నారని రమేష్ తెలిపారు. అదేవిధంగా నరసాపూర్ నియోజక వర్గంలో 2,06,837 మంది ఓటర్లు ఉండగా అందులో 1,04,710 మంది మహిళా ఓటర్లు, 1,02,120 మంది పురుష ఓటరులు, 7 మంది ఇతరులు ఉన్నారని అన్నారు. జనాభా లెక్కల ప్రకారం రెండు నియోజక వర్గాలలో పురుషులకన్నా మహిళా ఓటర్లే అధికారంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఇట్టి ఓటర్ల తుది జాబితాను జిల్లాలోని 576 పోలింగ్ బూతులతో ప్రదర్శిస్తున్నామని అన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, భారత ఎన్నికల కమిషన్ 18 ఏళ్ళు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదుకు ఏడాదిలో నాలుగు పర్యాయాలు నమోదు చేసుకోవడానికి అవకాశాలు కల్పించిందని క్షేత్ర స్థాయిలో కార్యకర్తల ద్వారా విస్తృత అవగాహన కలిగించి అర్హులైన ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఓటరు నమోదు, నిర్వహణలో ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదని ఇదే స్ఫూర్తి కొనసాగాలని అన్నారు. ఎటువంటి తప్పులు లేకుండా తుది జాబితా జాగ్రత్తగా రూపొందించామని, ఇందులో సాంకేతిక తప్పిదాలు, చిన్న పొరపాట్లున్నా ఏమైనా అభ్యంతరాలు ఉంటె పక్కాగా తెలిపితే సరిచేస్తామని అన్నారు. ఇది ఎన్నికల సంవత్సరమని, ఈ జాబితానే అన్నింటికీ ప్రామాణికమని అన్నారు. తిరిగి ఓటరు నమోదుకు పోర్టల్ ప్రారంభమవుతుందని, ఫారం-6,7,8 అందుబాటులో ఉంటాయియని, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోను వారి జాబితాను తుది జాబితాకు అనుబంధంగా చేరుస్తామని అన్నారు. రెండు ప్రాంతాలలో ఓటరుగా నమోదయిన వారు కొందరున్నారని ప్రజాప్రతినిధులు తెలుపగా , సరైన వివరాలు అందిస్తే సంబంధితులకు నోటీసు ఇచ్చి ఒక ప్రాంతంలో తొలగిస్తామని రమేష్ తెలిపారు. అలాగే చనిపోయిన , ఇతర ప్రాంతాలకు వెళ్లిన వివరాలు కూడా అందిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నుండి గూడెం ఆంజనేయులు, బి.జె.పి నుండి శివ, టి.డి.పి నుండి మహమ్మద్ ఆఫ్జాల్, బి.ఎస్.పి నుండి అప్పాజిపల్లి సురేష్, ఆర్.డి.ఓ. సాయి రామ్, స్వీప్ నోడల్ అధికారి రాజి రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, నరేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ ఇంజనీర్లతో టియుఎఫ్ఐడిసి పనులపై సమీక్ష: కలెక్టర్



ఖమ్మం, జనవరి 5: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా సత్తుపల్లి మునిసిపాలిటీలో రూ.26.94 కోట్లతో పనులను చేపట్టుటకు అనుమతులు ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మునిసిపల్ ఇంజనీర్లతో టియుఎఫ్ఐడిసి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్తుపల్లి మునిసిపాలిటి కి టియుఎఫ్ఐడిసి ద్వారా అనుమతులు వచ్చిన పనులను వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇట్టి పనుల్లో అంబేద్కర్ ఆడిటోరియం కమ్ లైబ్రరీ, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, వివేకానంద సెంటర్ ఫర్ ఎక్సేలెన్స్, మాడ్రన్ లాండ్రీ మార్ట్/ధోభీ ఘాట్, ఫుట్ పాత్ ల అభివృద్ధి, ఎల్ఇడి వీధి దీపాలు, డంప్ యార్డ్ అభివృద్ధి, స్ట్రాం వాటర్ డ్రెయిన్స్, షాపింగ్ కాంప్లెక్స్ లు, బిటి రోడ్స్, 23 వార్డుల్లో సిసి రోడ్లు, డ్రెయిన్స్, షాదీఖానా భవన నిర్మాణం, పార్కులు, తామర చెరువు, ట్యాంక్ బండ్ అభివృద్ధి తదితర పనులు ఉన్నట్లు ఆయన అన్నారు. అన్ని పనులు మునిసిపాలిటీ పరిధిలో చేపట్టాలని, డంప్ యార్డ్, ఎస్టీపి, వైకుంఠదామం తదితర పనులు మునిసిపాలిటీ పరిధి అవతల చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ సమీక్షలో శిక్షణా అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, డిఇ నవీన్, సత్తుపల్లి మునిసిపల్ ఏఇ సురేష్ తదితరులు ఉన్నారు.


Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.